


ఘనంగా మాఘపౌర్ణమి

భక్తజనసంద్రంగా మారిన సాగర తీరాలు

- పలుచోట్ల భారీ సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు

(ఆంధ్రజ్యోతి- అచ్యుతాపురం, ఎస్.రాయవరం, పరవాడ, రాంబిల్లి, పాయకరావుపేట రూరల్)

మాఘ పౌర్ణమి సందర్భంగా పుణ్యస్నానాలతో సాగర తీరాలు జనసంద్రంగా మారాయి. జిల్లాలో పరవాడ నుంచి పాయకరావుపేట వరకు అన్ని మండలాల్లో ప్రసిద్ధి చెందిన సముద్ర తీర ప్రదేశాలకు బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తుల రాకమొదలైంది. మధ్యాహ్నం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో సముద్ర స్నానాలు చేశారు.



ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం వద్ద మాఘ పౌర్ణమి పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులతో జనసంద్రంగా మారిన సాగర తీరం

అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద జాతరకు, సముద్ర స్నానాలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తూ జాగారం చేశారు. అనంతరం సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పలురకాల చర్యలు చేపట్టారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ డ్రోన్ కెమెరాతో పరిస్థితి పర్యవేక్షించారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పూడిమడక తీరంలో వున్న ఆలయంలో జగన్నాథస్వామిని దర్శించుకున్నారు.



రేవుపోలవరంలో పుణ్యస్నానం ఆచరిస్తున్న హోంమంత్రి అనిత

ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించడానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు పక్కనే వున్న కాకినాడ జిల్లా నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రేవుపోలవరం తీరంలో పుణ్యస్నాన మాచరించారు. అనంతరం పక్కనే కొండపై వున్న ఆలయంలో లక్ష్మీమాధవస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

రాంబిల్లి పంచాయతీ శివారు వాడపాలెం సముద్ర తీరంలో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం సమీపంలో వున్న మెట్టపై కొలువుదీరిన గంగాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

పాయకరావుపేట మండలంలోని పాల్మన్‌పేట, రత్నయ్యపేట, వెంకటనగరం, గజపతినగరం, రాజవరం, పెంటకోట సముద్ర తీర ప్రదేశాలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పెదరాంభద్రపురం గ్రామానికి చెందిన కె.ప్రకాశ్ అనే యువకుడు గజపతినగరం తీరంలో స్నానం చేస్తూ అలల తాకిడి ఒక్కసారిగా పెరగడంతో లోపలికి కొట్టుకుపోయాడు. మెరైన పోలీసులు వెంటనే స్పందించి గజఈతగాళ్లను అప్రమత్తం చేశారు. ప్రకాశ్‌ను నీటిలో నుంచి ఒడ్డుకు తీసుకువచ్చి ప్రాణాలు కాపాడారు.

పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం సాగర తీరం బుధవారం భక్తజనంతో పోటెత్తింది. మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. స్నానాల అనంతరం తీరంలో కొలువైన మాధవస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అంతకుముందు మంగళవారం రాత్రి మాధవస్వామి తీర్థమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



అచ్యుతాపురం మండలం పూడిమడక సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బర్డ్ ఫ్లూతో అప్రమత్తం

ఇప్పటి వరకు జిల్లాలో వైరస్ ఆనవాళ్లు లేవంటున్న అధికారులు



కె.కోటపాడు మండలం కొరువాడలో కోళ్ల ఫారాన్ని తనిఖీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ వైద్య బృందం

- అయినాసరే ముందు జాగ్రత్త చర్యలు
- పౌల్ట్రీల బాటపట్టిన పశుసంవర్ధక శాఖ అధికారులు
- మండలానికి రెండు బృందాల చొప్పున కోళ్ల ఫారాల్లో తనిఖీలు
- కోళ్లు చనిపోతే శాంపిల్స్ సేకరణ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లాకు పొరుగున ఉన్న ఉమ్మడి తూర్పు గోదావరి, ఆ పక్కనే ఉన్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ విస్తరిస్తుండడంతో పశుసంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. అనకాపల్లి జిల్లాలో బుధవారం వరకు ఎక్కడా బర్డ్ ఫ్లూ ఆనవాళ్లు కనిపించకపోయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ప్రతి మండలానికి రెండు చొప్పున వైద్య బృందాలను ఏర్పాటు చేసి, కోళ్ల ఫారాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎక్కడైన కోళ్లు చనిపోయినట్టయితే శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపడానికి ఏర్పాట్లు చేశారు.

పొరుగు జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ వైరస్ విస్తరిస్తుండడంతో అనకాపల్లి జిల్లా పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పలుచోట్ల బర్డ్ ఫ్లూ ప్రభావంతో గత రెండు రోజుల్లో వేలాది కోళ్లు మృత్యువాతపడ్డాయి. దీంతో వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, అన్ని జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు. పశువైద్యులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. కాగా బర్డ్ ఫ్లూ వైరస్ గాలి ద్వారా వ్యాప్తిచెందే అవకాశం వుండడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ వైరస్‌తో జిల్లాలో ఇంతవరకు కోళ్లు మృత్యువాత పడకపోయినప్పటికీ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పశుసంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రతి మండలంలో కోళ్ల ఫారాలను తనిఖీ చేసేందుకు రెండేసి బృందాలను నియమించారు. ప్రతి బృందంలో మండల పశు వైద్యాధికారి, సచివాలయ సిబ్బంది వున్నారు. ఫారాల్లో ఎక్కడైనా కోళ్లు చనిపోతే వాటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నారు. అన్ని ఫారాల వద్ద బయోసెక్యూరిటీ మెజర్స్ అమలు చేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలను నివాసాలకు సమీపంలో పడవేయకుండా, దూరంగా గొయ్యి తీసి పూడ్చాలని ఫారాల నిర్వాహకులకు చెబుతున్నారు.

కోళ్ల ఫారాల్లో తనిఖీలు



అనకాపల్లి జిల్లాలో ఇంతవరకు బర్డ్ ఫ్లూ వైరస్ లక్షణాలు కనిపించలేదు. అయినప్పటికీ కలెక్టర్ ఆదేశాల మేరకు పౌల్ట్రీ ఫారాలను సందర్శించి తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా వైరస్ లక్షణాలతో కోళ్లు చనిపోతే వెంటనే సమాచారం ఇవ్వాలని కోళ్ల ఫారాల నిర్వాహలకు చెబుతున్నాం. అనుమానం ఉన్నచోట కోళ్ల నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నాం.

డాక్టర్ జి.రామ్మోహన్‌రావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

జడ్.జోగుంపేట ఎంపీపీ స్కూల్ టీచర్లకు

డీఈవో షోకాజ్ నోటీసులు

- విద్యా బోధనలో అలసత్వం వహిస్తున్నందుకు చర్యలు
- ఉపాధ్యాయులు పాఠశాలకు సరిగా రావడం లేదని గ్రామస్థులు ఫిర్యాదు
- పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈవో
- తెలుగు సబ్జెక్టుపై వేసిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని స్థితిలో విద్యార్థులు
- హెచ్‌ఎంతోసహా ఇద్దరు ఉపాధ్యాయినులకు నోటీసులు



జడ్.జోగుంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు

రావికమతం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యా బోధనలో అలసత్వం ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులపై జిల్లా విద్యా శాఖాధికారి కొరడా ఝుళిపించారు. మూడు, నాలుగు తరగతుల విద్యార్థులు తెలుగు పాఠ్యాంశంపై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోవడంతో ఆయన హెచ్‌ఎంతోపాటు ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ శివారు జడ్.జోగుంపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు ... మిగతా 8వ పేజీలో

మరిన్ని అన్న క్యాంటీన్లు!

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయం

- ఇప్పటికే అనకాపల్లిలో రెండు, నర్సీపట్నం, ఎలమంచిలిలో ఒక్కో క్యాంటీన్
- ఈ పట్టణాలతోపాటు 'పేట, మాడుగుల, చోడవరంలో క్యాంటీన్లు
- కొత్తగా ఆరు క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభించడానికి అధికారులు సిద్ధం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లు జిల్లాలో మరికొన్ని ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే అనకాపల్లిలో రెండు, నర్సీపట్నం, ఎలమంచిలి పట్టణాల్లో ఒక్కొక్కటి చొప్పున క్యాంటీన్లు నడుస్తున్న విషయం తెలిసిందే. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రంలో ఒకటి చొప్పున అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. అంతేకాక ఇప్పటికే క్యాంటీన్లు నిర్వహిస్తున్న మూడు నియోజకవర్గాల్లో మరొకటి చొప్పున అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తారు. మొత్తం మీద జిల్లాలో కొత్తగా ఆరు క్యాంటీన్లు ఏర్పాటవుతాయి. ఈ మేరకు జిల్లాలో ఎక్కడక్కెడ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలో అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు.



ఎలమంచిలిలో అన్న క్యాంటీన్

తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు పట్టణాల్లో శ్రామికులు, రిక్షా కార్మికులు, ఆటో డ్రైవర్లు, దుకాణాల్లో పనిచేసే చిరుద్యోగులు, గ్రామాల నుంచి వివిధ పనులపై పట్టణాలకు వచ్చే వారికి రూ.5 నామమాత్రం రేటుతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టాలన్న ఉద్దేశంతో 'అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చింది. నాడు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉన్న అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్ టికెట్ బుకింగ్ కౌంటర్‌కు వెళ్లే మార్గంలో 2018 జూలై 11వ తేదీన అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ప్రతి రోజూ ఉదయం 300-400 మంది అల్పాహారం, మధ్యాహ్నం 500-600 మంది, రాత్రి 300-400 మందికి భోజనం పెట్టేవారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఎదురుగా 2019 జనవరి 11న అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖా మంత్రి, ప్రస్తుత శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఉదయం అల్పాహారం 350 మందికి, మధ్యాహ్నం భోజనం 350 మందికి, రాత్రి భోజనం 250 మందికి వడ్డించేవారు. ఎలమంచిలిలో అదే ఏడాది ఫిబ్రవరిలో తాత్కాలిక వసతి ఏర్పాటు చేసి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. తరువాత జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. అన్న క్యాంటీన్ల నిర్వహణపై శీతకన్ను వేసింది. అల్పాహారం 150 మందికి, భోజనాలు 200 మందికి కుదించారు. అయినా సరే ... మిగతా 8వ పేజీలో

డీసీఏవో గోవిందరావు సస్పెన్షన్

జిల్లా కార్యాలయంలో ఫర్నీచర్ కోసం విరాళాల వసూలు

- ఒక్కో సొసైటీ నుంచి రూ.5-10 వేలు సేకరణ
- డిజిటల్ ప్లాట్ ఫామ్ ద్వారా డబ్బులు పంపిన సిబ్బంది
- సహకార కమిషనర్‌కు ఫిర్యాదు
- జాయింట్ రిజిస్ట్రార్‌తో విచారణ
- విరాళాల సేకరణ వాస్తవమని తేలడంతో డీసీఏవోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా సహకార ఆడిట్ అధికారి (డీసీఏవో) జి.గోవిందరావును సస్పెండ్ చేస్తూ సహకార శాఖ కమిషనర్/రిజిస్ట్రార్ ఎ.బాబు ఉత్తర్వులు జారీచేశారు. అనకాపల్లిలో డీసీఏవో కార్యాలయానికి అవసరమైన ఫర్నీచర్ కొనుగోలుకు విరాళాలు సేకరించినట్టు వచ్చిన ఫిర్యాదులపై చేపట్టిన విచారణ మేరకు చర్యలు తీసుకున్నారు.

అనకాపల్లిలోని జిల్లా సహకార ఆడిట్ అధికారి కార్యాలయానికి అవసరమైన ఫర్నీచర్‌ను సమకూర్చుకునేందుకు డీసీఏవో గోవిందరావు, జిల్లాలో 74 ప్రాథమిక సహకార సంఘాల నుంచి విరాళాలు అడిగారు. ఈ విషయాన్ని ఫోన్‌లో మేసేజ్ చేశారు. సంఘం స్థోమతనుబట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు సొమ్ములు సేకరించారు. కొంతమంది ఆడిట్ సిబ్బంది విరాళాల సొమ్మును డీసీఏవోకు, కార్యాలయంలో సిబ్బందికి ఫోన్‌పే చేశారు. ఈ వివరాలను కొందరు ఆడిటర్లు/సహకార సిబ్బంది, జానకిరాంపురం అభ్యుదయ సంఘం, ఇతర ఉద్యోగులు సహకార శాఖ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వీటిపై స్పందించిన కమిషనర్ విచారణకు ఆదేశించారు. జాయింట్ రిజిస్ట్రార్ ఎన్.రాధికా మాధవి అనకాపల్లి వచ్చి విచారణ చేపట్టారు. అనంతరం కమిషనర్/రిజిస్ట్రార్‌కు నివేదిక ఇచ్చారు. డీసీఏవో కార్యాలయంలో ఫర్నీచర్ కొనుగోలుకు విరాళాలు సేకరించినట్టు నిర్ధారణ కావడంతో డీసీఏవో గోవిందరావును సస్పెండ్ చేశారు. ఈ బాధ్యతలను తాత్కాలికంగా అనకాపల్లి డీసీవో ప్రేమ స్వరూపరాణికి అప్పగించారు. ఇదిలావుండగా సహకార సంఘాల నుంచి విరాళాలు సేకరించి డీసీఏవోకు పంపిన ఆడిటర్లు/ఇతర సిబ్బందిపై మాత్రం చర్యలు లేకపోవడం గమనార్హం. ఆ దిశగా ఎందుకు విచారణ చేయలేదు? ఆమెపై ఒత్తిళ్లు వచ్చాయా? అన్నది ఉన్నతాధికారులు విచారణ చేయాల్సి ఉంది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 22,493 మంది

- 123 పోలింగ్ కేంద్రాలు
- నామినేషన్ల ఉపసంహరణకు నేడు ఆఖరి రోజు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి మొత్తం 22,493 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో పురుషులు 13,508, మహిళలు 8,985 మంది ఉన్నారు. అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 5,529 మంది ఓటర్లు ఉండగా, అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 568 మంది ఉన్నారు. కాగా ఈనెల 27వ తేదీన జరగనున్న ఎన్నికకు సంబంధించి ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ పూర్తయ్యింది. పది మంది నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం వరకూ గడువు ఉంది. పోలింగ్ కోసం 123 కేంద్రాలు ఎంపిక చేశారు. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది.

జిల్లాల వారీ పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు...

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
శ్రీకాకుళం జిల్లా	31	3,416	1,619	5,035
పార్వతీపురం మన్యం	15	1,574	759	2,333
విజయనగరం జిల్లా	29	3,270	1,953	5,223
అల్లూరి సీతారామరాజు	11	920	568	1,488
విశాఖపట్నం	13	2,539	2,999	5,529
అనకాపల్లి జిల్లా	24	1,789	1,096	2,885
మొత్తం	123	13,508	8,985	22,493

హడలెత్తిస్తున్న బీఎన్ రోడ్డు

పలుచోట్ల రేగుతున్న దుమ్ము, ధూళి

- వాహనచోదకులు, ప్రయాణికుల అవస్థలు

రావికమతం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ నుంచి గర్నికం, రావికమతం మార్గంలో ప్రయాణించాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో పాటు దుమ్ము, ధూళి రేగుతుండడంతో ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

చోడవరం నుంచి రోలుగుంట వరకు రహదారి అధ్వానంగా ఉండడంతో గత వైసీపీ వైసిపి ప్రభుత్వ హయంలో 78.90 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. దీంతో రోడ్డు పొడవునా పెద్ద గోతులతో అధ్వానంగా తయారైంది. వర్షమొస్తే ఆ గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు ఇబ్బందులు పడేవారు. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులే మట్టితో తాత్కాలికంగా గోతులు పూడ్చారు. అయితే ఈ పనులు చేపట్టాలని ఇటీవల కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఒప్పించడంతో మేడివాడ, గర్నికం గ్రామాల వద్ద పనులు ప్రారంభించి గోతులను క్వారీ బుగ్గి, పిక్కతో పూడ్చి వదిలేశారు. దీంతో వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో దుమ్ము, ధూళి ఎగసిపడి వెనుక వచ్చే ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.



మేడివాడ వద్ద బీఎన్ రోడ్డుపై రేగుతున్న దుమ్ము

సాగర తీరం.. భక్తజన సందోహం

- రేవుపోలవరంలో ఘనంగా మాఘ పౌర్ణమి జాతర
- పుణ్య స్నానాలు ఆచరించిన లక్షలాది మంది భక్తులు
- స్వామివారిని దర్శించుకున్న హోం మంత్రి అనిత, ప్రముఖులు



సముద్ర తీరంలో భక్తులకు లక్ష్మీమాధవస్వామి సుదర్శన చక్రానికి చక్రస్నానం చేయిస్తున్న పండితులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా రేవుపోలవరం సముద్ర తీరానికి భక్తులు పోటెత్తారు. తీరంలో పుణ్య స్నానాలు ఆచరించడానికి బుధవారం తెల్లవారు నుంచి సాయంత్రం వరకు అధికసంఖ్యలో జనాలు తరలివచ్చారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు వాహనాలపై అడ్డరోడ్డు వరకు చేరుకొని పుణ్య స్నానాలు ఆచరించగా, అక్కడ నుంచి నర్సీపట్నం డిపో నుంచి ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులపై చేరుకున్నారు. మరికొందరు కారులు, ద్విచక్ర వాహనాలపై చేరుకొని స్నానాలు చేశారు. భారీగా జనం తరలి రావడంతో పోలీసు అధికారులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సముద్రతీరానికి కొంత దూరంలో బస్సులు, బైకులు నిలిపివేసేందుకు పార్కింగ్ ఏర్పాటు చేయించారు. అక్కడి వరకు వాహనాలపై వచ్చిన జనం సముద్రతీరానికి కాలినడకన చేరుకొని, సముద్ర తీరంలో పుణ్యస్నానం ఆచరించారు. తరువాత అక్కడ పక్కనే కొండపై కొలువైన లక్ష్మీ మాధవస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు నుంచి సాయంత్రం వరకు జనాలు తరలి రావడంతో సుమారు లక్ష మంది వరకు ఇక్కడి సముద్రతీరంలో పుణ్య స్నానాలు ఆచరించినట్టు అధికారులు అంచనా వేశారు.

ఇందులో భాగంగా సముద్రతీరంలో పుణ్య స్నానాలు ఆచరించి తిరిగి వెళ్లిన జనాలకు ట్రాఫిక్ సమస్యలతో పాటు సముద్రతీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న సమయంలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు తాగునీటిని సరఫరా చేశాయి. దేవతామూర్తులను పల్లకీపై సముద్రతీరంలో ఊరేగించారు. అనంతరం స్వామి వారి సుదర్శన చక్రానికి పండితులు సముద్రంలో చక్రస్నానం చేయించారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావుతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు ఇక్కడి లక్ష్మీ మాధవస్వామి వారిని దర్శించుకున్నారు. మాఘ పౌర్ణమి జాతర సందర్భంగా సముద్రతీర ప్రాంతంలో భారీ తీర్థం సాగింది

పుణ్యస్నానం ఆచరించిన హోం మంత్రి అనిత

మాఘ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రేవుపోలవరం సముద్రతీరంలో ముందుగా సూర్య నమస్కారం చేశారు. తరువాత పుణ్యస్నానం ఆచరించారు. అలాగే భక్తులతో మాట్లాడి ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. అనంతరం మీడియాతో హోం మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల పాటు రేవుపోలవరంలో మాఘ పౌర్ణమి ఏర్పాట్లను గాలికి వదిలేశారన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాము అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లతో పాటు డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కొండపై ఉన్న లక్ష్మీమాధవస్వామిని హోం మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, నాయకులు ఎస్.వెంకటరాజు, గుర్రం రామకృష్ణ, కోడ లోవరాజు పాల్గొన్నారు.



రేవుపోలవరంలో స్వామివారిని దర్శించుకుంటున్న హోం మంత్రి

పూడిమడకలో భక్త జనసంద్రం



పూడిమడక తీరంలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘపౌర్ణమి సందర్భంగా ఘనంగా పూడిమడక తీరంలో జాతర జరిగింది. ఈ జాతరలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సముద్ర స్నానాలు చేశారు. జాగరణకు వచ్చిన భక్తులంతా తీరంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు తిలకించారు. ఫలితంగా తీరంలోని ఇసుక తిన్నెల్లో ఏ



పూడిమడక తీరంలో మంగళవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలకు పోటెత్తిన జనం

ర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాకు భక్తులు పోటెత్తారు. దీంతో మంగళవారం రాత్రి తీరం జనాలతో నిండిపోయింది. అలాగే బుధవారం ఉదయం తొమ్మిది దాటిన తర్వాత భక్తులు భారీ స్థాయిలో వచ్చారు. దీంతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. డీఎస్పీ విష్ణు స్వరూప్ పూడిమడక తీరంలో డ్రోన్ కెమెరాతో పాటు బైనాకులర్ సహాయంతో పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జగన్నాథస్వామిని దర్శించుకున్నారు అలాగే జాతరలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అందరికీ అకట్టుకున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ఆయన జాతరలో తిరిగి అందరినీ ఆశ్యర్యపరిచారు. తీరంలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. తీరంలోని వేణుగోపాలస్వామి, లక్ష్మీ, సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కూటమి నాయకులు మేరుగు ప్రవీన్, మేరుగు బాపునాయుడు ఉన్నారు.



జగన్నాథస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

పేటలో పోటెత్తిన సముద్ర తీరాలు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి పర్వదినాన్ని మండల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే కుటుంబ సభ్యులతో కలిసి సముద్ర స్నానం చేశారు.



భక్తులతో కిక్కిరిసిపోయిన పాల్మన్‌పేట సముద్ర తీరం

మండలంలోని పాల్మన్‌పేట, రత్నయ్యపేట, వెంకటనగరం, గజపతినగరం, రాజవరం, పెంటకోట సమదతీర ప్రాంతాలు భక్తజనసందోహంతో కిటకిటలాడాయి. అనంతరం వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంధువులు, స్నేహితులతో సహపంక్తి భోజనాలు చేశారు. తీర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హోటళ్ల, చిరు దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. కాగా మాఘ పౌర్ణమి సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పాయకరావుపేట సీఐ జి.అప్పన్న, పెంటకోట మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ వై.మురళీరావు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

తీరంలో ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. కాగా మండలంలోని పెదరాంభద్రపురం గ్రామానికి చెందిన కె.ప్రకాష్ అనే యువకుడు తన స్నేహితులతో కలిసి గజపతినగరం తీరంలో స్నాన్నం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ సముద్రంలోకి కొట్టుకుపోతుండటాన్ని గుర్తించిన మెరైన పోలీసులు హుటాహుటిన సముద్రంలోకి వెళిల ఒడ్డుకి తీసుకువచ్చారు. అప్పటికే యువకుడు నీరుతాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో పోలీసులు తక్షణమే సపర్యలు చేశారు. అనంతరం ప్రాథమిక వైద్యం అందజేయడంతో ప్రాణాపాయం తప్పింది.

వాడపాలెం తీరంలో గంగమ్మకు పూజలు



వాడపాలెం తీరంలోని ఆలయంలో గంగాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

రాంబిల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాడపాలెం సముద్ర తీరంలో వేలాది మంది భక్తులు బుధవారం పుణ్య స్నానాలు ఆచరించారు. వేకువ జామునుంచి భక్తులు తీరానికి చేరుకున్నారు. మత్స్యకారుల ఆరాధ్యదైవం గంగాదేవిని దర్శించుకుని, పసుపు, కుంకుమతో పూజించి మొక్కులు తీర్చుకున్నారు. వేలాది మంది భక్తులతో వాడపాలెం తీరం జనసంద్రంలా మారింది. వేకువ జాము 4 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకు రాంబిల్లి నుంచి వాడపాలెం సముద్రతీరం వరకు వెళ్లే రోడ్డు భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సీఐ నరసింగరావు ఆధ్వర్యంలో రోడ్డు పొడవునా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అలాగే గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. కాగా, లోవపాలెం, వెంకయ్యపాలెం, వాడ నడర్సాపురం, కొత్తపట్నం సముద్రతీరాల్లో కూడా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన శ్రీ ప్రకాష్ విద్యార్థి



98.52 పర్సంటైల్ సాధించి సాయిఅనీష్

పాయకరావుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థి జి.సాయి అనీష్ జేఈఈ మెయిన్స్‌ఫలితాల్లో 98.52 పర్సంటైల్ మార్కులు సాధించి సత్తా చాటినట్టు ప్రిన్సిపాల్ వీవీఎస్ఎస్ భానుమూర్తి తెలిపారు. మంగళవారం ప్రకటించిన ఈ ఫలితాల్లో .అనీష్ 98.52 పర్సంటైల్ సాధించడం తోపాటు మరో 20 విద్యార్థులు 90, ఆపైన పర్సంటైల్ సాధించారన్నారు. ఈవిద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, అధ్యాపకులు అభినందించారు.

పులపర్తి గ్రామ సర్పంచ్ రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా అందజేస్తున్న కొండబాబు

ఎలమంచిలి, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులపర్తి గ్రామ సర్పంచి సుంకర కొండబాబు బుధవారం రాజీనామా చేసినట్టు ఎంపీడీఓ కేఎస్ కొండలరావు తెలిపారు. సర్పంచ్‌గా పనిచేసేందుకు తన ఆరోగ్య పరిస్థితులు అనుకూలించడం లేదని ఆ రాజీనామా పత్రంలో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ రాజీనామా పత్రాన్ని డీపీవోకు పంపిస్తామన్నారు. పులపర్తి గ్రామ సర్పంచిగా సుంకర కొండబాబు వైసీపీ మద్దతుదారునిగా గత ఎన్నికల్లో గెలుపొందారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ గుర్తింపు కార్డులతోనే సంక్షేమ పథకాలు

- రైతు సేవా కేంద్రాల్లో ప్రక్రియ ప్రారంభం

కోటవురట్ల: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సంక్షేమ పథకాలు పొందాలంటే రైతులకు ఫార్మరీ రిజిస్ట్రేషన్ కచ్చితంగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణీ బి సరోజని తెలియజేశారు. బుధవారం చౌడువాడ రైతుసేవా కేంద్రంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. రైతులతో ఆమెసమీక్షసమావేశం నిర్వహించారు. గుర్తింపుకార్డు రిజిస్ట్రేషన్‌కోసం పట్టాదారు పాస్‌పుస్తకం, ఫోన్ నంబరు తీసుకు రావాలన్నారు.

రాంబిల్లి: మండలంలోని పలు పంచాయతీలలోని రైతుసేవా కేంద్రాల్లో బుధవారం ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏవో సి.సుమంత మాట్లాడుతూ, సొంత భూమి ఉన్న ప్రతి రైతుకి ఒక యూనిక్ నంబర్ ఉంటుందన్నారు.దాని ద్వారా పీఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, రాయితీలు, పంటలు బీమా, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే పరిహారం అందుతుందన్నారు.

ఎలమంచిలి: మండలంలోని కృష్ణాపురంలో బుధవారం ఏవో మోహనరావు ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రామానికి శ్రీకారం చుట్టారు. 36 మంది రైతులకు విశిష్ట సంఖ్య (యూసీ) నమోదు చేసినట్టు తెలిపారు. మండలంలో వెబ్ ల్యాండ్ డేటా ప్రకారం 6988 మంది రైతులున్నట్లు గుర్తించారన్నారు. ప్రస్తుతం భూ యజమానులకు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీ జరుగుతుందన్నారు.



కోటవురట్ల: చౌడువాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సరోజని

సత్యవరంలో పొలం పిలుస్తోంది

పాయకరావుపేట రూరల్: మండలంలో సత్యవరం పంచాయతీలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పి.ఆదినారాయణ అపరాల పంటను పరిశీలించారు. గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి రైతు గుర్తింపు సంఖ్య, ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై అవగాహన కల్పించారు. వ్యవసాయ అనుబంధశాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించి రబీ పంటను ఈ కేవైసీ 100 శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. సర్పంచి సఖిలేటి రాముతోపాటు వీహెచ్ఏ మౌనిశ్, వీఏఏ అమృతతోపాటు గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రేబాక గూడుపమ్మతల్లిని దర్శించుకున్న హోం మంత్రి

నక్కపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి క్షేత్రాన్ని బుధవారం రాత్రి హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు, కూటమి నాయకులు,గ్రామ పెద్దలు ఘనస్వాగతం పలికారు. గూడుపమ్మతల్లి క్షేత్రంలోముందుగా హోం మంత్రి అనిత అష్టాదశ శక్తిపీఠాల దేవతామూర్తులను దర్శించుకున్నారు. అమ్మవారి చిత్రపటాన్ని ,శేష వస్త్రాన్ని ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజు బహూకరించారు. గ్రామసులు పలు సమస్యలపై ఆమెకు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సాధిరెడ్డి చిన వెంకన్న, వర ప్రసాద్, కరణం సూరిబాబు, విజయ్, కూటమి నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జి, అమలకంటి అబద్దం, జానకి శ్రీను, గుర్రం రామకృష్ణ, రమేశ్,వెలగా శ్రీను, సుధాకర్ పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న హోం మంత్రి అనిత

ఘనంగా శోభాయాత్ర



కలశాలతో శోభాయా త్రలో పాల్గొన్న మహిళలు

నక్కపల్లి: స్థానిక చేనేత కాలనీలో కొత్తగా నిర్మించిన సుబ్రహ్మణ్య, ఆంజనేయస్వామి ఆలయాల ప్రారంభ మహోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఉపమాక వెంకన్న సన్నిధి నుంచి మహిళలు కలశాలు, ప్రతిష్ఠించాల్సిన విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు.

శివ పార్వతుల కల్యాణ మహోత్సవం

ఎలమంచిలి: ఎలమంచిలి కొత్తపేట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాఘపౌర్ణమి పురస్కరించుకుని అర్చకుల ఈ మహోత్సవాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన చార్టెడ్ అక్కౌంటెంట్ బీఎస్. బంగారు శెట్టి ఇంటి నుంచి ఎదురు సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గడ్డి కుప్పలు దగ్ధం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జగ్గన్నపేటలో పొలంలో ఉన్న విద్యుత వైర్లు నుంచి నిప్పులు రాలటంతో రెండు గడ్డి కుప్పలు, ట్రాక్టర్ టైర్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి రైతు మల్ల శ్రీనివాసరావు పొలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అతని కల్లానికి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌నుంచి నిప్పులు రాలి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామస్థులు వచ్చి వచ్చి ఆర్పారు.

'మద్యంపై మాట తప్పిన కూటమి ప్రభుత్వం'

మునగపాక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మద్యం విధానంపై కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆరోపించారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఇంటింటికి సంక్షేమ పథకాలు అందజేస్తే కూటమి ప్రభుత్వం వీధి వీధికి మద్యంఅందుబాటులో తీసుకువచ్చినట్టు విమర్శించారు. సమావేశంలో నేతలు సరాలశెట్టి సూర్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రాంబిల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ ఏజీఎం ఎన్. మధుసూదన్‌రెడ్డి అన్నారు. గోకివాడ కెనరాబ్యాంక్ బ్రాంచి ఆధ్వర్యంలో మూలజంప గ్రామంలో బుధవారం కృషి వసంత్ మెగాప్రెస్ అగ్రి డిస్ప్లేమెంట్ మెగా క్యాంపెయిన్ నిర్వహించారు. బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజాకుర్రా, సర్పంచి ఎన్.శారద, గ్రామ నాయకులు ఎన్వీ సూర్యనారాయణ, ద్వారపురెడ్డి అప్పారావు గోకివాడ, మామిడివాడ, అచ్యుతాపురం, పరవాడ కెనరా బ్యాంక్ మేనేజర్లు వి.అశోక్, కిషోర్‌కుమార్, రాకేష్, రామేశ్, వెలుగు సీసీ రమణ, గ్రామస్థులు పాల్గొన్నారు...

ఎస్‌బీఐ సేవలపై అవగాహన

రాంబిల్లి: బ్యాంక్ సేవలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక స్టేట్‌బ్యాంక్ మేనేజర్ వి.శశికాంత్ అన్నారు. బుధవారం వాడనర్సాపురంలో వర్కుషాపును నిర్వహించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, మేనేజర్ వి. అశోక్‌కుమార్ , గ్రామ మాజీ సర్పంచ్ చింతకాలయ ఎర్రయ్య, నేతలు చోడిపల్లి ప్రసాద్, కోదండరావు, నాని, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెనరాబ్యాంక్ ఏజీఎం మధుసూదన్‌రెడ్డి

నక్కపల్లిలో టీడీపీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీడీపీ నూతన కార్యాలయాన్ని బుధవారం హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు తొలుత అనితకు ఘనస్వాగతం పలికారు. అనంతరం కార్యాలయం ప్రారంభించారు. నాయకులు కురందాసు నూకరాజు, అమకంటి అబద్ధం, జానకీశ్రీను, బుజ్జి, వైబోయిన రమణ, గుర్రం వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ జనరల్ సెక్రటరీగా సిగిరెడ్డి నాయుడు



సిగిరెడ్డి నాయుడు

రాంబిల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల జనరల్ సెక్రటరీ, దిమిలి గ్రామ పార్టీ అధ్యక్షుడిగా దిమిలి గ్రామానికి చెందిన సిగిరెడ్డి నాయుడు నియమితులయ్యారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం తనపై ఉన్న నమ్మకంతో ఇచ్చిన పదవికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తానన్నారు. కేంద్ర, రాష్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు, పార్టీ బలోపేతానికి పాటుపడతానని నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ధ్యానంతో మంచి ఫలితాలు

మునగపాక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మునగపాక పీఏసీఎస్ ఫంక్షన్ హాలులో గిజా పిరమిడ్ కేంద్రం ఆధ్వర్యంలో వ్యవస్థాపకురాలు సరిసా లీలా ప్రసన్న కుమారి సారధ్యంలో జరుగుతున్న ధ్యానంపై అవగాహన సదస్సు రెండో రోజు బుధవారం కొనసాగింది. ఈ సదస్సుకు హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టార్, ధ్యానరత్న నరేంద్రముదల్కర్ విచ్చేసి మాట్లాడారు.నాగులాపల్లి చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ కేంద్రంలో గురువు వనజ మాట్లాడారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

మునగపాక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా సుమారు రూ.5కోట్లు అంచనా వ్యయంతో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం కోసం విరాళాలు సేకరణలో భా గంగా కమిటీ సభ్యులు విశాఖలో పర్యటించారు. విశాఖకు చెందిన ఐ.వి.ఎస్.యుగంధర్, దాడి నారాయణరావు, గ్రంధి రాజేవ్, పెంటకోట నిర్మిల తదితరులు రూ.2లక్షలు చొ ప్పున, గవర నాగ శేషు రూ. లక్ష ఇచారు. కమిటీ సభ్యులు బొడ్డేడ ప్రసాద్, రాము, జగ్గారావు, పెంటకోట ఉమేశ్ పాల్గొన్నారు.

ఆహార దినుసులు వితరణ

అచ్యుతాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లోని టోయోట్సో రేర్ ఎర్త్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్య ప్రతినిధులు మోసయ్యపేటలోని మండల దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు ఆహార దినుసులు వితరణ చేశారు. వీటిని పాఠశాల వ్యవస్థాపకులు పీఎస్ తిరుపతి పట్నాయక్‌కి కర్మాగారం ఎండీ కోల్చిసెటో, జీఎం మురళి బుధవారం అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి

▸▸ జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే 'పంచకర్ల'



ఎమ్మెల్యే రమేష్‌బాబును సత్కరిస్తున్న జనసేన పార్టీ శ్రేణులు

పరవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా శక్తివంచన లేకుండా కృషి చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి అంతా కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. తొందరలోనే జనసేన మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కమిటీలలోసీనియార్టీ ఆధారంగా ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. గత ఎన్నికల్లో తన గెలుపునకు కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం మండల పరిధిలోని గ్రామాల వారీగా అభివృద్ధి, కార్యకర్తల సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను పార్టీ శ్రేణులంతా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శిరపురపు అప్పలనాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, మోటూరి సన్యాసినాయుడు, చింతకాయల సుజాత, చేపల మసేను, పార్టీ నాయకులు పంచకర్ల ప్రసాద్, బుగిడి రామగోవిందరావు, కరణం నర్సింగరావు, బలిరెడ్డి అప్పారావు, వర్రి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన ఆయకట్టు రైతుల సమస్య

▸▸ పెదనాయుడు చెరువు గర్భం విస్తీర్ణం తగ్గకుండా చర్యలు

▸▸ ఎస్‌డీసీ సీతారామాంజనేయులు బృందం సమావేశం



రైతులతో మాట్లాడుతున్న ఎస్‌డీసీ సీతారామరాజు బృందం

సబ్బవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ సబ్బవరం శివారు పెదనా యుడుపాలెం రైతుల సమస్య కొలిక్కి వచ్చింది. చెరువు గర్భం తగ్గిపోకుండా చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు రైతులకు హామీ ఇవ్వడంతో వారంతా శాంతించారు. పెదనాయుడు చెరువు గర్భంలో కొంత భూమి విశాఖ- రాయపూర్ రోడ్డు కనెక్టివిటీ (సింగిల్ ట్రంపు రోడ్డు) నిర్మాణానికి తీసుకున్నారు. దీనిని వారం రోజుల క్రితం ఆయకట్టు రైతులు అడ్డుకున్నారు. రైతుల డిమాండ్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచన మేరకు ఎస్‌డీసీ జె.సీతారామాంజనేయులు, ఎన్‌హెచ్-130 పీడీ రోహిత్‌కుమార్, రహదారి నిర్మాణ సంస్థ సైట్ ఇంజనీర్ రామకృష్ణ, స్థానిక ఇరిగేషన్ ఏఈ సాయికిరణ్ బుధవారం ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డీసీ, పీడీ మాట్లాడుతూ విశాఖ- రాయపూర్ రోడ్డు నిర్మాణంలో పెదనాయుడు చెరువు గర్భం ఎంత విస్తీర్ణంలో పోతుందో ఆ మేరకు రైతుల వద్ద నుంచి ప్రైవేటు భూమిని సేకరించి చెరువు విస్తీర్ణం తగ్గకుండా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా పోతురాజు చెరువు అలుపు, కళింగ నుంచి సర్‌ప్లస్ వాటర్ ప్రవహించే కాలువ కూడా రహదారి నిర్మాణంలో పూడ్చేసినందును సదరు కాలువ కూడా తవ్వి, నీరు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఆ కాలువ కూడా తవ్వి కల్వర్టు నిర్మిస్తామని ఎస్‌డీసీ, పీడీ హామీ ఇచ్చారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేసి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు కొటాన అప్పారావు, ఆదిరెడ్డి పోతురాజు, సబ్బవరపు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 4,166 మంది హాజరు

అనకాపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు ఉదయం, మధ్యాహ్నం కలిపి మొత్తం 4,166 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 4,283 మంది హాజరు కావలసి ఉండగా, 117 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 88 కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షకు 2,268 మంది హాజరు కావాల్సి ఉండగా, 2,198 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు మొత్తం 2,015 మంది హాజరు కావాల్సివుండగా, 1,968 మంది హాజరయ్యారు 47 మంది గైర్హాజరయ్యారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఐఈవో సుజాత తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె' తరపున ప్రచారం

కశింకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు గెలుపే లక్ష్యంగా అంతా పనిచేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ వైష్ణవ కరుణానిధి మూర్తి అన్నారు. మండలంలోని తాళ్ళపాలెం, కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తేగాడ మోడల్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకటవ ప్రాధాన్యత ఓటు వేసి శ్రీనివాసులునాయుడును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూఎస్ గౌరవాధ్యక్షుడు అయినాల అప్పారావు. ఎస్‌టీయూ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఆచంట రవి, పీఆర్‌టీయూ ప్రతినిధులు ఎ.ప్రసాదరావు, ప్రభాకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చేతులు శుభ్రపర్చుకుంటే ఆరోగ్యం



విద్యార్థులతో చేతులు కడిగిస్తున్న ఉపాధ్యాయుడు

కశింకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలని వెదురుపర్తి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని బుధవారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం భోజనం చేయకముందు, చేసిన తరువాత చేతులు కడిగే విధానాన్ని వివరించారు. దీనివల్ల ప్రతి రోజూ ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు

భక్త జన సంద్రం

▸▸ మాఘ పౌర్ణమి సందర్భంగా ముత్యాలమ్మపాలెం తీరం కిటకిట ▸▸ వివిధ ప్రాంతాల నుంచి భారీగా రాక ▸▸ స్నానాలు ఆచరించి పూజలు



తీరం ఒడ్డున కోలాహలం



ముత్యాలమ్మపాలెం తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

పరవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరం బుధవారం భక్తజనంతో పోటెత్తింది. మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని పుణ్యస్నానాలు చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారు. దీంతో తీరం కోలాహలంగా మారింది. చిన్నా, పెద్దా అన్న తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం తీరంలో కొలువైన మాధవస్వామికి పూజలు నిర్వహించారు. సర్పంచ్ చింతకాయల సుజాత, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతకాయల అమ్మోరు తదితర మత్స్యకార నాయకులు మాధవస్వామిని దర్శించుకురు. యువజన సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. స్నానాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గజ ఈతగాళ్లను నియమించారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని పరవాడ సీఐ మల్లికార్జునరావు, సిబ్బంది ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేశారు. అలాగే ముత్యాలమ్మ జంక్షన్ నుంచి తీరానికి వచ్చే రహదారిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

ఘనంగా మాధవస్వామి తీర్థం



గంగాలమ్మ ఆలయంలో పూజలు

ఇదిలావుంటే, ముత్యాలమ్మపాలెం తీరంలో మంగళవారం రాత్రి మాధవస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలి రావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాముగరిడీ, కోలాటం, చిడతలు, తప్పెటగుళ్ళు, పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తీర్థంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పి.బోనంగిలో ఇంటర్ విద్యార్థికి డెంగ్యూ

▸▸ కేజీహెచ్ వైద్య పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ

▸▸ వైద్య సేవల అనంతరం కోలుకున్న బాలుడు

పరవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థికి డెంగ్యూ జ్వరం సోకింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పి.బోనంగికి చెందిన విద్యార్థి విశాఖలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. గత నెల 10న సంక్రాంతి సెలవులకు స్వగ్రామానికి వచ్చాడు. సెలవుల అనంతరం అదే నెల 22న కళాశాలకు వెళ్లిపోయాడు. వెళ్లిన మూడు రోజులు తరువాత అతనికి ఒళ్లునొప్పులతో పాటు విపరీతమైన జ్వరం వచ్చింది. వెంటనే కళాశాల యాజమాన్యం విశాఖ కేజీహెచ్‌లో చేర్పించగా వైద్యులు రక్త పరీక్షలు జరిపి డెంగ్యూ సోకినట్టు నిర్ధారించారు. కేజీహెచ్ వైద్యులు విద్యార్థి ఆధార్ కార్డు చిరునామా మేరకు సదరు విషయాన్ని అనకాపల్లి డీఎంహెచ్‌వోకు సమాచారం అందించారు. ఈ మేరకు బుధవారం వాడచీపురుపల్లి వైద్యాధికారి కనక అప్పారావు పర్యవేక్షణలో ఆ విద్యార్థి స్వగ్రామానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లో సైక్లోథిన్ ద్రావణాన్ని కిరోసిన్‌లో కలిపి పిచికారీ చేయించారు. అనంతరం పలు సూచనలు చేశారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం మెరుగ్గానే ఉందని అతని తండ్రి తెలిపారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో చకచకా అభివృద్ధి పనులు

▸▸ వైద్యులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం ▸▸ క్రిటికల్ కేర్ యూనిట్ పనులు పరిశీలన ▸▸ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా ఆసుపత్రి ఎన్టీఆర్ వైద్యాలయంలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆమె ఆస్పత్రిని తనిఖీ చేశారు. క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణాన్ని పరిశీలించి, పనుల వివరాలు తెలుసుకున్నారు. ఈ యూనిట్ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పురోగతిపై అధికారులకు సూచనలు చేశారు. నిధులకు ఇబ్బంది లేదని చకచకా పనులను పూర్తి చేయలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలన్నారు. ఆసుపత్రిలో సదుపాయాలు, బ్లాక్‌లలో ఇబ్బందులను వైద్యుల ద్వారా ఆరా తీశారు. అన్ని రకాల వైద్య సేవలందించాలన్నారు. కేసులను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

పది గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సబ్బవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతు పనులు చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఫీడర్ పరిధిలోని అంతకాపల్లి, రావులమ్మపాలెం, టిక్కలిపాలెం, నాయనమ్మపాలెం, రాయపు అగ్రహారం, ఆరిపాక, బంగారమ్మపాలెం, అద్దూరు, గొటివాడ, లగిశెట్టిపాలెం గ్రామాలకు ఆ రోజు ఉదయం ఏడు గంటల నుంచి మధ్నాహ్నం పన్నెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని వివరించారు. ఆయా గ్రామాల్లోని వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

బంగారమ్మపాలెం రామాలయంలో సప్తాహం

సబ్బవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బంగారమ్మపాలెంలోని రామాలయం వద్ద ఈనెల 15న ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవం జరగనున్న నేపథ్యంలో ఎనిమిదో తేదీన ప్రారంభమైన దివ్య నామ సప్తాహం అత్యంత భక్తిశ్రద్ధలతో సాగుతోంది. ఈ సందర్భంగా సర్పంచ్ దాడి లావణ్య మాట్లాడుతూ శనివారం ప్రారంభమైన ఈ కార్యక్రమం వారంరోజుల పాటు నిర్విరామంగా కొనసాగుతోందన్నారు. ప్రతి భజన బృందం రెండు గంటల పాటు హరే రామ హరేకృష్ణ నామస్మరణతో భజనలు చేస్తున్నట్టు చెప్పారు. గురుదేవ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి రాపర్తి జగదీష్ ఆధ్వర్యంలో, శరగడం రమేశ్ సహకారంతో జరుగుతుందన్నారు. గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, దొడ్డి రాజుకోటి, సూరిశెట్టి సూర్యనారాయణ, దాడి సూరిబాబు గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళలకు హక్కులపై అవగాహన అవసరం

▸▸ న్యాయ విశ్వవిద్యాలయం న్యాయ సేవా కేంద్రం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీసుధ



మహిళల హక్కులపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీసుధ, ఐసీడీఎస్ సిబ్బంది

సబ్బవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు రాజ్యాంగం కల్పించిన హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం న్యాయ సేవా కేంద్రం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీసుధ అన్నారు. న్యాయ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఇక్కడి ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం మహిళల హక్కులపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. సమాజంలో ఆడవారిపై గురుతరమైన బాధ్యతలు ఉన్నాయన్నారు. పిల్లలను తమకాళ్లపై తాము నిలబడే వరకూ క్రమ శిక్షణతో పెంచాలన్నారు. అలాగే, అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. అనం తరం మహిళల హక్కులపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీవో రమణ కుమారి, డీపీవో శ్రీలత, డాక్టర్ సీహెచ్.లక్ష్మి, డాక్టర్ భావనేశ్వరిలతో పాటు పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకుంటేనే పథకాలు



అక్కిరెడ్డిపాలెంలో పొలాలను పరిశీలిస్తున్న ఏడీ సుబ్రహ్మణ్యం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అక్కిరెడ్డిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూరగాయల పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే పంటల్లో పురుగు మం దులు ఏ మోతాదులో ఉపయోగించాలో తెలియజేశారు. రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు ఈ విధంగా నమోదైన వారికి మాత్రమే అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాలాపు శాంతి, టీడీపీ నాయకుడు సాలాపు సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కన్నూరులో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో చంద్రావతి

పరవాడ : ప్రభుత్వ పథకాలు పొందాలంటే రైతులంతా తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.చంద్రావతి సూచించారు. కన్నూరులో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో 14 అంకెలతో కూడిన ప్రత్యేక కార్డును జారీ చేస్తుందన్నారు. ఇది రైతులకు గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుందని వివరించారు. రైతులు తమ ఆధార్ నంబరు, ఆధార్ అనుసంధానిత ఫోన్ నంబర్, భూమి రికార్డుల వివరాలతో ఆయా గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. రైతుల ఎదుటే ఆయా వివరాలను సిబ్బంది అప్‌లోడ్ చేస్తారని వివరించారు. ఈ నెల 25వ తేదీలోగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఆమె సూచించారు.

మంచినీటి ట్యాంకు వద్ద పారిశుధ్య లోపం



సాలాపువానిపాలెంలో తాగునీటి ట్యాంకు వద్ద దుస్థితి

లంకెలపాలెం, ఫిబ్రవరి 12 : జీవీఎంసీ 84వ వార్డు సాలాపువానిపాలెంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకు వద్ద పారిశుధ్యం లోపించింది. డ్రైనేజీని ఆను కొని ట్యాంకు ఉండడంతో ఈ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతోంది. ట్యాంకు నుంచి నీటిని సరఫరా చేసే పైపులైన్ డ్రైనేజీలో నుంచి రావడంతో పూర్తిగా నాచుపట్టింది. ట్యాంకు గోడలు కూడా ఇదే దుస్థితిలో ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అంటున్నారు. ఈ సమస్యపై తక్షణమే జీవీఎంసీ స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

లంకెలపాలెం కూడలి- పరవాడ మార్గంలో గుంతలు పూడ్చివేత



రహదారిలోని గుంతలను పూడ్చుతున్న దృశ్యం

లంకెలపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం కూడలి నుంచి ఫార్మాసిటీ, పరవాడ మార్గంలో గుంతల పూడ్చివేతకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ రహదారిలో లంకెలపాలెం కూడలి నుంచి స్థానిక రైల్వే ట్రాక్‌పై గల బ్రిడ్జి చివరి వరకు పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో గుంతల కారణంగా ఫార్మాసిటీలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులతో పాటు పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ చిన్నచిన్న ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇది గుర్తించిన ఆర్‌అండ్‌బీ అధికారులు ఎట్టకేలకు రహదారి పొడవునా ఇరువైపులా ఉన్న గుంతల పూడ్చివేతకు పనులు చేపట్టారు. దీంతో వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో తీర్థాలు



సబ్బవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయమ్మపాలెంలో సీతారాములు, ఎర్రవానిపాలెంలో శ్రీకృష్ణ, మొగలిపురంలో బండమ్మతల్లి తీర్థాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ గండి అరుణ, గండి వంశీదీప్, గ్రామ పెద్దలు తమరాన బంగారునాయుడు, నానాజీ, పంచదార్ల దేముడు, కోన కృష్ణ, రోమాల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మరిడిమాంబ పండుగ



పరవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రావాడ పంచాయతీ బొట్టవానిపాలెంలో గురువారం మరిడిమాంబ పండుగ జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు.

బాడీబిల్డింగ్ విజేతకు ఘన సత్కారం



విజేత సంతోష్‌ను సత్కరిస్తున్న జిమ్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన 30వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 70 కిలోల విభాగంలో స్థానిక అవినాష్ పవర్ జిమ్‌కు చెందిన పి.సంతోష్ ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా విజేతను బుధవారం ఇక్కడ జిమ్ చైర్మన్ ఐఆర్ గంగాధర్ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేహ దారుఢ్యంపై అంతా అవగాహన పెంచుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని సూచించారు. జిమ్ మేనేజర్ గొర్లి స్వామిగౌడ్, ఇల్లా అవినాష్, బుద్ద గణేశ్, దొడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల విభాగం ఏడీగా కుమారస్వామి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు, హిజ్రాల సంక్షేమశాఖ అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌గా కె. కుమారస్వామి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న జగదీష్‌కు పదోన్నతి రావడంతో విశాఖజిల్లా పర్యాటక ప్రాంతీయ డివిజనల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. కుమారస్వామి విజయనగరం కలెక్టరేట్‌లో సీపీవోగా పనిచేస్తూ ఏడీగా ఇక్కడి విచ్చేశారు.

స్వామి వివేకానంద గొప్ప సంఘ సంస్కర్త



స్వామివివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సీలేరు, ఫిబ్రవరి 12, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు డీఏవీ పాఠశాలలో బుధవారం స్వామివివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కా ర్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూస్వామివివేకానంద సరస్వతి గొప్ప సంఘ సంస్కర్త అని, ఆయన సమాజాన్ని తీర్చిదిద్దిన విధానాలను వివరించారు. ప్రతీ ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. వేద పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

15 నుంచి 'పెసా' శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంపీడీవో డేవిడ్‌రాజు

పాడేరురూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పెసా కమిటీల విధివిధానాలు, సభ్యుల బాధ్యతలపై ఈ నెల 15వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు కోరారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ, ఉన్నతాధికారుల ఆదేశాల మే రకు ఈ శిక్షణను ఇటీవల ఎన్నికైన పెసా కమిటీ వైస్ ప్రెసిడెంట్‌లు, కార్యదర్శులు, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, డ్వాక్రా గ్రూపు అధ్యక్షులు 1,869 మందికి రోజుకు 200 మంది చొప్పున శిక్షణ అందించ నున్నామన్నారు. ఒక బ్యాచ్‌కు 100 మంది చొప్పున రోజుకు రెండు బ్యాచ్‌లకు మాస్టర్ ట్రైనర్ పెసా చట్టంపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలను స్థానిక కాఫీ హౌస్‌లో, మోదకొండమ్మ ఆలయం వద్ద గల కమ్యూనిటీ హాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించ నున్నామన్నారు. ఏ పంచాయతీ పరిధిలోని సభ్యులు ఏ రోజు హాజరు కావాలన్న విషయాన్ని ఆయా సచివాలయాల కార్యదర్శుల ద్వారా సమాచారం అందించినట్టు పేర్కొన్నారు.

మూడు మండలాల్లో రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్‌లలో ఫీడర్‌ల మరమ్మతులు నేపథ్యంలో 14వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మూడు మండలాల్లో గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్‌ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో జి.మాడుగుల మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. పాడేరు సబ్ స్టేషన్ 11 కేవీ బొక్కెళ్ల ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున మండలంలోని కోరాపుట్టు, డి.గొందూరు, కోడాపల్లి, బొక్కెళ్ల గ్రామాలకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు. చింతపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అన్నవరం, లోతుగెడ్డ, బలపం, బెన్నవరం గ్రామాలకు విద్యుత్ సరపరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నేత్ర వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పాడేరురూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కంటి వ్యాధితో బాధపడుతున్న వారు ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్. టి.విశ్వేశ్వరరావునాయుడు కోరారు. సహజంగా 50 ఏళ్లు దాటిన తరువాత తరచుగా కంటికి సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పాడేరులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, అరకు, రంపచోడవరంలో ఏరియా ఆస్పత్రులలో కంటి వైద్య నిపుణులు, అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రోగులు సమీప ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందాల ని కోరారు. కంటి ఆపరేషన్లకు తప్పని సరిగా ఆధార్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ బుక్ తప్పని సరిగా తీసుకువెళ్లాలని ఆయన తెలిపారు.

'వైసీపీ బలోపేతానికి కృషి'



వైసీపీ నూతన మండల అధ్యక్షుడు పరశురాంను సన్మానిస్తున్న నాయకులు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా నియమితులైన పాంగి పరశురామ్‌ను ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ, తను ఈ పదవిలో నియమించిన అధినేతకు, ఎమ్మెల్యే మత్స్యలింగంనకు రుణపడి ఉంటానన్నారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచులు నాగేశ్వరరావు, వెంకటరావు, నాయకులు సింహాచలం, కృష్ణారావు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జి.మాడుగుల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ మండల యువత ప్రధాన కార్యదర్శి లకే రామకృష్ణ తెలిపారు. బుధవారం అయన సోలభం, వంతాల పంచాయతీల సచివాలయాలను సందర్శించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను డిజిటల్ అసిస్టెంట్‌ను వివరించారు. విద్యార్థులకు ముఖ్యంగా జన్మదిన ధ్రువపత్రాలు సకాలంలో అం దించాలని కోరారు. ఉపాధి పనులు కల్పన, తాగు, సాగు నీటి సదుపాయాలపై అధికారులతో మాట్లాడినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాలువ శిథిలం.. పరిసరాలు దుర్గంధం

- సీలేరు మార్కెట్ తొమ్మిదో క్రాస్ రోడ్డు మధ్యన దుస్థితి
- ఇళ్లలోని వాడుక నీలిచి వ్యాధుల భయం



ఎక్కడికక్కడ మూసుకుపోయిన ఉన్న కాలువ



పరిసరాల్లో నిలిచిన మురుగు

సీలేరు, ఫిబ్రవరి 12 , (ఆంధ్రజ్యోతి): జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధిలో మార్కెట్ లైన్, తొమ్మిదో క్రాస్‌రోడ్డు (ఎక్స్‌టెన్సన్) మధ్యన శిథిలమైన కాలువతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ కాలువ నిర్మాణం చేపట్టి 25 ఏళ్లకు పైగా కావడంతో కాలువ రూపురేఖలు మారిపోయాయి. దీంతో ఇళ్లలోని వాడక నీరు ఎక్కడ నీరు పరిసరాల్లో నిలిచి దు ర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు దోమలు పెరిగి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర జ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వర్షాకాలంలో నీరు ఇళ్లలోకి చేరి తీవ్ర ఇ బ్బందులకు గురవుతున్నామని స్థానికులు వా పోతున్నారు. దీనికితోడు పంచాయతీ నిధులను ప్రజాప్రయోజనాల పనులకు వినియోగించుకుండా అనవసరమైన వాటిని దుర్వినియోగం చేస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. స్థానిక సర్పంచి స్పందించి కాలువ నిర్మాణానికి చ ర్య లు తీసుకోవాలని స్థానిక సీఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే సుభాన్ ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు.

చిన్నారుల్లో పోషకాహార లోపంపై ప్రత్యేక శ్రద్ధ

- జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిషేక్‌గౌడ



ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌గౌడ

పాడేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పోషకాహార లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలోని 11 మం డలాల్లోని సీడీపీవోలతో అంగన్‌వాడీ కేం ద్రాల్లో సేవలపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేం ద్రాలకు అవసరమైన నిత్యావసర సరకులకు సంబంధించిన ఇండెంట్‌ను సకాలంలో పెట్టాలన్నారు. అలాగే టేక్ హోమ్‌రేషన్‌ను గర్భిణులు, బాలింతలు సక్రమంగా వినియోగిం చుకు నేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పాలు, గుడ్ల నాణ్యతలను ఎప్ప టికప్పుడు తనిఖీ చేయాలని ఆయన సూచించారు. అలాగే ఏఏ ప్రాంతాల్లో పోషకాహార లోపం అధికంగా ఉన్న పిల్లలున్నారనే విషయాలను అడిగి తె లుసుకున్నారు. అలాగే చిన్నారుల హాజరు, డేటా ఎంట్రీ సక్రమంగా చేయాలని, చిన్నారుల ఎదుగుదలను పర్యవేక్షిం చాలన్నారు. కిషోర వికాసం, సఖీ గ్రూపుల ఏర్పాటుపై ఆరా తీశారు. బాల్య వివాహాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మీ, ఏజెన్సీ మండలాల సీడీపీవోలు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీపై ఆరా

పాడేరురూరల్: మండలంలోని కిండంగి జీసీసీ డీఆర్ డిపో, ఎఫ్‌పీ షాపును ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిత్యావసర సరకులు, బియ్యం నిల్వలను పరిశీలించారు. ఆయిల్, ఇతర నిత్యావసరాల వస్తువులపై నున్న గడువు తేదీలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి గొడౌన్ ఇన్‌చార్జి సంతకాలు లేనందున అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కిండంగిలోని చౌక ధరల దుకాణాన్ని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సకాలంలో రేషన్ అందుతుందా లేదా అని ఆరా తీశారు. ఎండీయూ ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసరాలను పరిశీలించారు. కందిపప్పు సరఫరా తక్కువగా ఉండటంపై ప్రశ్నించారు. రాజ్‌మా సరఫరా అందుబాటులో ఉన్నందున కందిపప్పు అమ్మకాలు తక్కువగా ఉంటాయని, అందుకే ఈ పప్పు సరఫరా తగ్గించినట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి.గణేశ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ బజ్జంగి నల్లన్న, కిండంగి వీఆర్‌వో పి.పద్మావతి పాల్గొన్నారు.

పి.బోనంగిలో ఇంటర్ విద్యార్థికి డెంగ్యూ

- కేజీహెచ్ వైద్య పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ
- వైద్య సేవల అనంతరం కోలుకున్న బాలుడు

పరవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థికి డెంగ్యూ జ్వరం సోకింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పి.బోనంగికి చెం దిన విద్యార్థి విశాఖలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. గత నెల 10న సంక్రాంతి సెలవులకు స్వగ్రామానికి వచ్చాడు. సెలవుల అనంతరం అదే నెల 22న కళాశాలకు వెళ్లిపోయాడు. వెళ్లిన మూడు రోజులు తరువాత అతనికి ఒళ్లునొప్పులతో పాటు విపరీతమైన జ్వరం వచ్చింది. వెంటనే కళాశాల యాజమాన్యం విశాఖ కేజీహెచ్‌లో చేర్పించగా వైద్యులు రక్త పరీక్షలు జరిపి డెంగ్యూ సోకినట్టు నిర్ధారించారు. కేజీహెచ్ వైద్యులు విద్యార్థి ఆధార్ కార్డు చిరునామా మేరకు సదరు విషయాన్ని అనకాపల్లి డీఎంహెచ్‌వోకు సమాచారం అం దించారు. ఈ మేరకు బుధవారం వాడచీపురుపల్లి వైద్యాధికారి కనక అప్పారావు పర్యవేక్షణలో ఆ విద్యార్థి స్వగ్రామానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లో సైక్లోథిన్ ద్రావ ణాన్ని కిరోసిన్‌లో కలిపి పిచికారీ చేయించారు. అనంతరం పలు సూచనలు చేశారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం మెరుగ్గానే ఉం దని అతని తండ్రి తెలిపారు.

మొరాయిస్తున్న బీఎస్ఎన్ఎల్ సేవలు



జి.మాడుగులలో బీఎస్ఎన్ఎల్ టవర్

జి.మాడుగుల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ సే వలు తరుచూ మొరాయిస్తుండడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. గత కొన్నిరోజులుగా సిగ్నల్స్ అందక ఫోన్లు సరిగా పనిచేయడంలేదని వాపోతున్నారు. త రచూ ఇదే సమస్య ఎ దుర్కొంటున్నట్టు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో ప్రైవేట్ టెలికం కంపెనీల సేవలు మరలాల్సి వస్తోందని చెబుతున్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

పాడేరురూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 14వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నామని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు తెలిపారు. ఎంపీపీ సొనారి రత్నకుమారి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించ నున్నామన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని అయన కోరారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావాలన్నారు. హాజరు కానికి సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి పెసా కమిటీలకు శిక్షణ

చింతపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో గురువారంనుంచి పెసా కమిటీలకు ఎనిమిది రోజుల పాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్టు స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పెసా కమిటీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, డ్వాక్రా సభ్యులకు ఈ చట్టంపై శిక్ష ణ అందిస్తామన్నారు.రోజూ200మందికి శిక్షణ ఇస్తామని, ఈనెల 21 వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు.

కేంద్ర ప్రాజెక్టుకు 15 పంచాయతీలు ఎంపిక



విజయవాడ వర్క్ షాపులో పాల్గొన్న జిల్లా సర్పంచ్‌లు, కార్యదర్శులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పంచాయతీ రాజ్ శాఖకు అనుబంధంగా కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఆధ్వర్యంలోని పిరమల్ ఫౌండేషన్ పైలెట్ ప్రాజెక్టుకు పాడేరు మండలంలోని 15 పంచాయతీలను ఎంపిక చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు తెలిపారు. దేశ వ్యాప్తంగా నాలుగు రాష్ట్రాలలో 60 పంచాయతీలు ఎంపికకాగా, అందులో ఏఎస్ఆర్ జిల్లా పాడేరు మండలంలోని 15 పంచాయతీలున్నాయన్నారు. ఈ ఎంపికైన 15 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, పంచాయతీ యంత్రాంగం బుధవారం విజయవాడ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఒక్క రోజు వర్క్‌షాపులో పాల్గొన్నారన్నారు. రెండు సంవత్సరాలు ఉండే ఈ ప్రాజెక్టులో ఈ ఎంపికైన పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ మేరకు అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ, డీఎల్‌పీవో కుమార్, పిరమల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముమ్మర వాహన తనిఖీలు



ముంచంగిపుట్టులో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపడుతున్న దృశ్యం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి జోలాపుట్టు, పెదబయలు, కుమడ, సంగడ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారుల జంక్షన్ల వద్ద సీఆర్‌పీఎఫ్ పోలీసులు బలగాలు బుధవారం ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఛతీస్‌గడ్‌లో వరుసగా మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు నెలకొంటున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. మండల కేంద్రం మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అలాగే బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ ప్రధాన రహదారులు ఇరువైపులా, క ల్వర్టులు, వంతెనలు, కాజ్‌వేలు తదితర ప్రదేశాల్లో అణువణువు మెటల్‌డిటెక్టర్లతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నా, అపరిచిత వ్యక్తులు కనిపించినా తమకు సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

రేషన్ సరకులు పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చటకంభలో గిరిజనులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న అధికారులు

అనంతగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పంచాయతీ వంట్లమామడి, బోనూరు, చీడిమెట్ట, గడ్డిబంధ గ్రామాలకు బుధవారం ఎండీఎం వాహనం ద్వారా రేషన్ సరకులను అందించారు. 'రేషన్ సరకులు కోసం పడిగాపులు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఉదయం పినకోట పంచాయతీ చటకంభ గ్రామానికి చేరుకున్న సివిల్‌సప్లై డీటీలు ప్రశాంత్, అప్పలస్వామి, వీఆర్వో రామకృష్ణ దగ్గరుండి ఎండీఎం ఆపరేటర్ ద్వారా ఆయా గ్రామాల గిరిజనులు రేషన్ సరకులను పంపిణీ చేశారు. ప్రతి నెలా సరకులను నిర్లక్ష్యం లేకుండా పంపిణీకి చర్యలు చేపడతామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. దీంతో గిరిజనులు ఆనందం వ్యక్తంచేశారు.

గుండెపోటు రోగులకు స్టెమితో చికిత్స

- చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో అందుబాటులోకి వైద్య సేవలు



రోగికి స్టెమి చికిత్స అందిస్తున్న సూపరింటెండెంట్ ఇందిరా ప్రియాంక

చింతపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో గుండెపోటు బాధితులకు ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్(స్టెమి) పద్ధతిలో చికిత్స అందించి ప్రాణాపాయ స్థితిని నుంచి కాపాడుతున్నట్టు స్థానిక సూపరింటెండెంట్ పి. ఇందిరా ప్రియాంక తెలిపారు. బుధవారం ఆమె ఏరియా ఆస్పత్రిలో స్టెమిపై రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛాతినొప్పి, శ్వాస సక్రమంగా అందకపోవడం, చెమటలు పట్టడం, వికారం, వాంతులు గుండె నొప్పికి కారణమన్నారు. ఈ లక్షణాలతో ఆస్పత్రికి వచ్చిన రోగికి ఆక్సిజన్ అందించి ఈసీజీ తీస్తామన్నారు. రోగికి వచ్చింది గుండె నొప్పా? కాదా? అని నిర్ధారించి స్టెమి పద్ధతిలో ఓ ఖరీదైన ఇంజక్షన్ ఇ స్తామన్నారు. స్టెమి అంటే గుండె రక్తనాళం శతశాతం పూడుకుపోవడంతో వచ్చే సమస్య. ఈతెనెక్టెప్లస్ ఇంజక్షన్‌తో కొద్ది సేపటికే అవరోధం తొలగిపోనుందన్నారు. ఈ చికిత్స విధానం రాష్ట్ర ప్రభుత్వం ఏరియా ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. గుండెపోటు వ్యాధి లక్షణాలతో ఆస్పత్రికి వచ్చిన మండల కేంద్రానికి చెందిన తంగేటి నారాయణమ్మ, కిన్నెర్ల గ్రామానికి చెందిన పాంగి బాలమూర్తి, లోతుగెడ్డ పంచాయతీ కోటకొండ గ్రామానికి చెందిన గెమ్మెలి సోమరాజులకు ఈ చికిత్స అందించి ప్రాణాలను కాపాడగలిగామన్నారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కి తరలించామన్నారు. రోగులు స్టెమి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: ఏపీడీ



రత్నంపేటలో ల్యాండ్ లెవిలింగ్ పనులు పరిశీలిస్తున్న ఏపీడీ సీతయ్య

కొయ్యూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కూలీలకు పనుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని చింతపల్లి క్లస్టరు ఏపీడీ లాలం సీతయ్య హెచ్చరించారు. బుధవారం మండలంలో కొండ గోకిరి, నల్లగొండ గ్రామాలలో మినీ గోకులాలు నిర్మాణాలను పరిశీలించి రైతులకు సూచన సలహాలు అందించారు. రత్నంపేటలో ల్యాండ్ లెవిలింగ్ పనులు తీరుపై పరిశీలన జరిపారు. నడింపాలెం పంచాయతీలో పనుల వారీగా పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం శరభన్నపాలెంలో ఇంకుడుగుంత నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు చేశారు. పథకం ద్వారా నిర్దేశించిన కొలతలప్రకారం పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోఏపీవో శ్రీనివాసు, వీఆర్‌పీలు, టీఏలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

స్టడీ అవర్‌లో ఉపాధ్యాయులు లేకపోవడంపై ఆగ్రహం



కందమామిడి బాలికల ఆశ్రమ పాఠశాల్లో పాఠాలు బోధిస్తున్న పీవో అభిషేక్ గౌడ

పాడేరురూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ డాక్టర్. ఎంజే.అభిషేక్ గౌడ హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని కందమామిడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. స్టడీ అవర్‌లో ఉండాల్సిన ఉపాధ్యాయులు లేక పోవడంతో హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 6వ తరగతి, 10వ తరగతి విద్యార్థినులకుజరుగుతున్న స్టడీ హవర్‌ను పరిశీలించారు. విద్యార్థినులకు ఆంగ్ల పాఠ్యాంశాలను బోధించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని హెచ్‌ఎంకు సూచించారు. వంటగది, స్టాక్ రూంలను పరిశీలించారు. విద్యార్థుల మెనూపై ఆరా తీశారు. మరో సారి సందర్శించినపుడు ఉపాధ్యాయులు లేక పోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట'



మాట్లాడుతున్న టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానేశ్వరి

చింతపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రతి గ్రామానికి రహదారి సదుపాయం కల్పించి డోలి మోతలకు స్వస్తిపలకాలని కార్యాచరణ ప్రారంభించారన్నారు. ప్రతి కుటుంబానికి జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి సదుపాయం కల్పిస్తున్నారన్నారు. ఆదివాసీ విద్యార్థుల అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గ్రామ సభ, స్వపరిపాలనకు పెద్దపీట వేస్తూ పేసా కమిటీల ఎన్నికలు నిర్వహించారన్నారు. భూ బదలాయింపు చట్టంపై వైసీపీ నాయకులు చేసిన అసత్య ప్రచారానికి ప్రభుత్వం తిప్పికొట్టిందన్నారు. ఆదివాసీల్లో గందరగోళ వాతావరణం సృష్టించారని, దీంతో స్వయంగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి భూబదలాయింపు చట్టాన్ని సవరించే ఆలోచన ప్రభుత్వానికిలేదని, గిరిజన చట్టాలను పటిష్టం చేస్తామని స్పష్టమైన భరోసా ఇచ్చారన్నారు. జీవో 3 చట్టాన్ని తీసుకువచ్చింది చంద్రబాబేనన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రద్దయిన ఈ చట్టాన్ని మళ్లీ పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నట్టు ఆమె వివరించారు.

ఎన్నో ఏళ్ల కల.. ఫలిస్తున్న వేళ!

చలిసింగం కొండ శిఖర గ్రామ గిరిజనుల కలలు ఫలిస్తున్నాయి. ఎన్నో ఏళ్ల వారి కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన రెండు ప్రధాన హామీలు నెరవేరుతున్నాయి. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తాగునీరు, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటుండడంతో గ్రామస్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- రూ.35 లక్షలతో రక్షిత నీటి కల్పనకు చురుగ్గా పనులు
- కొండపైన రహదారి నిర్మాణానికి చర్యలు
- కూటమి ప్రభుత్వ హామీలు అమలు
- గిరిపుత్రుల్లో హర్షాతిరేకాలు

కొండ శిఖర చలిసింగం గిరిజనుల తాగునీటి కష్టాలకు చెక్


చలిసింగం శివారులోని ఈ బావి నీరే గిరిజనులకు ఆధారం


పొలాల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న మహిళలు

రావికమతం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు కొండ శిఖర చలిసింగం గ్రామంలో వంద కుటుంబాలకు చెందిన 450 మంది గిరిజన జనాభా కలిగిఉంది. మూడు కొండలపైన మూడు కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేక తాగునీటి కోసం అగచాట్లు పడ్డారు. సరికదా బోర్లు వేయాలన్నా రిగ్గులు ఈ గ్రామానికి వెళ్లేందుకు అవకాశం లేదు. దీంతో ప్రతి ఏటా వేసవిలో గుక్కెడు నీటి కోసం రేయింబవళ్లు గిరిజన మహిళలు కష్టాలు ఎదుర్కొంటున్నారు. వర్షా కాలంలో కలుషితమైన నీటితో తరచూ రోగాలు బారిన పడుతున్నారు. సీపీఎం ఆధ్వర్యంలో పలుమార్లు గ్రామ గిరిజనులు, రోడ్డు, తాగునీరు కోసం ఆందోళనలు చేస్తున్నారు.

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలన్న సంకల్పంతో అప్పటి ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ లోగా ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అను మతులు లేవంటు పనులు నిలిపివేశారు. దీంతో గ్రామంలో సమస్యలు మళ్లీ మొదటికి వచ్చాయి. వైసీపీ ప్రభుత్వ పాలనలో గిరిజనులు ఆందోళనలు చేపట్టారు. అప్పటి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గ్రామ సందర్శనకు వెళ్లగా, గిరిజనులు గ్రామ పొలి మేరల్లోనే అడ్డగించారు. దీంతో తాగు నీరు సౌకర్యం కల్పిస్తామని ఆయన ఇచ్చిన హామీ మేరకు 2022 లో నాబార్డు నిధులు రూ.31 లక్షలతో గ్రావిటీ పై తాగు నీటి సరఫరాకు పనులు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ మేరకు కొండ దిగువన శికాయిపాడు వద్ద బోరు నిర్మించి, అక్కడ నుంచి కొండ పైనున్న చలింగంనకు పైపులైను ఏర్పాటు చేసి, గ్రామంలో ట్యాప్‌లు అమర్చారు. కింద నుంచి కొండపైకి తాగునీరు వెళ్లేందుకు సింగిల్ పేస్ విద్యుత్ మోటారు ఏర్పాటు చేసి పైపు లైన్ ద్వారా పైకి నీళ్లు పంపే విధంగా పనులు చేశారు. ఈ విధానం ఫలితం ఇవ్వలేదు. రూ. లక్షలతో చేపట్టిన పనులు వృథాగానే మిగిలాయి. కనీసం చుక్కనీరు సరఫరాకా లేదు.సింగిల్ పేస్ విద్యుత్ మోటారు కావడంతో ఎత్తుగా కొండపైకి నీరు చేరడంలేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేతులు దులిపేశారు. గిరిజనుల తాగునీటి కల అలాగే ఉండిపోయింది. దీంతో ఈ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఈ గ్రామానికి తాగునీటి కోసం జలజీవన్ పథకంలో మరో రూ.41 లక్షలు చేయించారు. దీంతో శికాయి పాడు వద్ద ఒక ట్యాంకు, కొండపైన ఒక ట్యాంకు నిర్మించి, దిగువన ట్యాంక్‌లో నీరు స్టోరేజ్ చేసి అక్కడ నుంచి పైపులైన్ ద్వారా త్రీ పేజ్ విద్యుత్ మోటారు ద్వారా నీటిని పంపించాలని నిర్ణయించారు. పైనున్న ట్యాంక్ ద్వారా గ్రామంలో కుళాయిల ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నారు. ఈ వేసవి నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు ఆదేశాలతో ఈ పనులు ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే ఇటీవలే ఈ గ్రామాన్ని కలెక్టర్ విజయకృష్ణన్, ఇతర శాఖల జిల్లా అధికారులతో పాటు ఎమ్మెల్యే రాజు సందర్శించారు. రోడ్డు నిర్మాణానికి ఉన్న అటవీ శాఖ అడ్డంకులు తొలగించారు. దీంతో అభివృద్ధి పనులు పూర్తయితే డోలీ మోతలు, తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ప్రస్తుతం చలిసింగం కొండపైకి నిర్మిస్తున్న స్టోరేజీ ట్యాంకు


వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించి వృథాగా వదిలేసిన కుళాయిలు, పైపులైన్లు

ఇంటర్వ్యూ..

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం

-బొంజుబాబు, ఎంఈవో



మండలంలో 11 పాఠశాలల నుంచి 471 మంది విద్యార్థులు పది పరీక్షలకు సిద్ధంగా ఉన్నారు. శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేస్తున్నాం. మూడు పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. చీడికాడ జిల్లా పరిషత్ హైస్కూల్, మంచాల మోడల్ స్కూల్, ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేశాం. కోనాం గురుకుల బాలికల పాఠశాల కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ప్రశ్న: ఈ ఏడాది ఎంత మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు?

జవాబు: మండలంలో 11 పాఠశాలల నుంచి 471 మంది విద్యార్థులు పది పరీక్షలకు సిద్ధంగా ఉన్నారు. శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

ప్ర: ఎన్ని పరీక్ష కేంద్రాలు ఉన్నాయి? ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?

జ: మూడు పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. చీడికాడ జిల్లా పరిషత్ హైస్కూల్, మంచాల మోడల్ స్కూల్, ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేశాం.

ప్ర: సీసీ కెమెరాలు ఏయే కేంద్రంలో ఏర్పాటు చేశారు?

జ: కోనాం గురుకుల బాలికల పాఠశాల కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ప్ర: మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి? ఎన్ని పాఠశాలలకు సొంత భవనాలు లేవు?

జ: మండలంలో 11 ఉన్నత, 36 ప్రాథమిక, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. కోనాం శివారు చెరకుపల్లి గ్రామంలో పాఠశాలకు సొంత భవనం లేదు. దీంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం. చుక్కపల్లి ఉన్నత పాఠశాలకు సొంత భవనాలు నిర్మాణ దశలో ఉండడంతో ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నాం.

ప్ర: నాడు-నేడు పథకంలో ఎన్ని పాఠశాల భవనాలు ఆగిపోయాయి?

జ: 14 పాఠశాలలు భవనాలు ఆగిపోయాయి. వీటిపై ప్రభుత్వానికి నివేదిక అందించాం.

ప్ర: ఉపాధ్యాయులు కొరత ఎక్కడైనా ఉందా?

జ: ప్రస్తుతం ఎక్కడా కొరత లేదు.

-చీడికాడ, ఆంధ్రజ్యోతి

భక్తిశ్రద్ధలతో నల్లగొండమ్మ గిరి ప్రదక్షణ


తాండవ నల్లగొండమ్మతల్లి ఆలయ గిరిప్రదక్షణలో భక్తులు

నాతవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవ జలాశయం దగ్గర బుధవారం నల్లగొండమ్మతల్లి గిరి ప్రదక్షణ నిర్వహించారు. ఈ ప్రదక్షణను ఆలయ ధర్మకర్త కూనిశెట్టి జోగిరాజు జెండా ఊపి ప్రారంభించారు. భక్తులు ఆడాకుల, తాండవ స్పిల్‌వేగేట్లు, జాలారిపేట గ్రామాల మీదుగా బయలుదేరి 10 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షణ చేశారు. తిరిగి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి గంటా కొండలరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మరిడేశ్వరరావు, నాయకులు గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

25లోగా భూ ఆధార్ నమోదు చేసుకోవాలి


సాలికమల్లవరంలో భూ ఆధార్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

గొలుగొండ , ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూమి కలిగిన రైతులు ఈ నెల 25వ తేదీలోగా భూ ఆధార్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి సుధారాణి సూచించారు సాలికమల్లవరం గ్రామంలో బుధవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురికి భూ ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. భూమి కలిగిన ప్రతీ రైతు భూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం అమలు చేస్తున్నదని, తద్వారా పలు సంక్షేమ పథకాలు అందుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం


ఏఎల్‌పురంలో స్నేహితుడి కుటుంబానికి నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కృష్ణాదేవిపే, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలోని ఎస్టీ కాలనీకి చెందిన నర్పె శ్రీను గత నెల 27న మృతి చెందగా, అతని కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. 2006-2007 బ్యాచ్‌లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం శ్రీను తల్లిదండ్రులు నర్పె వెంకన్న, చినబుల్లిని కలిసి రూ.45 వేలు నగదును అందించారు. ఇప్పటికే ఈ బ్యాచ్ విద్యార్థులు కష్టాల్లో ఉన్న తోటి స్నేహితులకు ఆదుకోవడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

వాలాబులో పశు సంపదపై సర్వే


గ్రామంలో గొర్రెలను పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖాధికారులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలాబు గిరిజన పంచాయతీలో పశు సంపదపై ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం సర్వే చేశారు. పంచాయతీలో గొర్రెలు, మేకల పెంపకం ఏ మేరకు జరుగుతుందనే అంశంపై జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి రామమోహన్, డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు ప్రాథమిక సర్వే చేశారు. గొర్రెలు, మేకల పెంపకందారుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీఓవో సువర్ణరాజు, ఏపీఎం ప్రభాకర్, పశు వైద్యాధికారులు మంజుషారాణి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి గుర్రం పరుగు పోటీలు

నాతవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపేట గ్రామంలో మహలక్ష్మీ అమ్మవారి జాతరను పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 15 గుర్రాలు పాల్గొన్నాయి. గుర్రాల పోటీలను తిలకించడానికి పరిసర గ్రామాల వారు అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. పోటీల్లో విజేతగా రామన్నపాలెంకు చెందిన విక్రమ్ గుర్రం నిలిచింది. అలాగే రెండో స్థానంలో కోటనందూరుకు చెందిన శివరాజ్ బ్రదర్స్ గుర్రం, తృతీయ స్థానంలో అనకాపల్లికి చెందిన గుర్రం నిలిచాయి. విజేతకు రూ.15 వేలు, ద్వితీయ స్థానం సాధించిన గుర్రం యజమానికి రూ.12 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన గుర్రం యజమానికి రూ.10 వేలు నగదు అందజేయనున్నట్టు మహాలక్ష్మీ అమ్మవారి జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు, టీడీపీ నాయకులు వి.వెంకట కృష్ణారావు, దొర పాల్గొన్నారు.



నాతవరం: లింగంపేటలో గుర్రాల పరుగు పోటీల దృశ్యం.. దేవరాపల్లిలో జరుగుతున్న ఎడ్ల పరుగు పోటీలు

దేవరాపల్లిలో ఎడ్ల పరుగు పోటీలు

దేవరాపల్లి: మండల కేంద్రంలో ఉమామహేశ్వరీ దేవి తీర్థ మహోత్సవం సందర్భంగా బుధవారం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. పోటీల్లో సిద్ధి వినాయక ఎడ్ల జత విజేతగా నిలిచింది. అలాగే ముమ్మిన శంకర్ (నర్సయ్యపేట), మరిడిమాంబ (వావిలపాడు) ఉమామహేశ్వరిదేవీ (దేవరాపల్లి), నేమాల నరేశ్ (లక్కవరం), లక్ష్మీనరసింహ (దేవరాపల్లి), నర్సింగ్ యాదవ్ (నర్సాపురం), అభయాంజనేయ (కేజె.పురం) పరిదేశిమాంబ (వావిలపాడు), బండారు హేమతేజ (కేఎల్.బి.పట్నం) ఎడ్ల జతకు వరుసగా తర్వాత స్థానాలు సాధించాయి. విజేతలకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నగదు బహుమతులు అందించారు. వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నాయకులు పైలా ప్రసాదరావు, కిలపర్తి భాస్కరరావు, పి.పాత్రునాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డిప్యూటీ డీఈవో అప్పారావు

రోలుగుంట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని డిప్యూటీ డీఈవో అప్పారావు సూచించారు. మండలంలోని బుచ్చెంపేటలో పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదిలోకి వెళ్లి పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. సిలబస్ పూర్తయిందా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్లో చూచిరాతలు ఉండవని, అత్యంత పకడ్బందీగా జరుగుతాయని చెప్పారు. ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయులతో డిప్యూటీ డీఈవో సమావేశమయ్యారు.


బుచ్చెంపేటలో పది విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

రైతు గుర్తింపు కార్డులతో సంక్షేమ పథకాలు

కోటవురట్ల: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సంక్షేమ పథకాలు పొందాలంటే రైతులకు ఫార్మరీ రిజిస్ట్రేషన్ కచ్చితంగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి బి సరోజని తెలియజేశారు. బుధవారం చౌడువాడ రైతుసేవా కేంద్రంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. రైతులతో ఆమెసమీక్షసమావేశం నిర్వహించారు. గుర్తింపుకార్డు రిజిస్ట్రేషన్‌కోస పట్టాదారు పాస్‌పుస్తకం, ఫోన్ నంబరు తీసుకు రావాలన్నారు.

ధ్యానంతో మంచి ఫలితాలు

మునగపాక, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మునగపాక పీఏసీఎస్ ఫంక్షన్ హాలులో గిజా పిరమిడ్ కేంద్రం ఆధ్వర్యంలో వ్యవస్థాపకురాలు సరిసా లీలా ప్రసన్న కుమారి సారధ్యంలో జరుగుతున్న ధ్యానంపై అవగాహన సదస్సు రెండో రోజు బుధవారం కొనసాగింది. ఈ సదస్సుకు హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టార్, ధ్యానరత్న నరేంద్రముదల్కర్ విచ్చేసి మాట్లాడారు.

కేశవ స్వామికి చక్రస్నాన వేడుకలు


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు... (ఇన్‌సెట్‌లో) కేశవస్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

చోడవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ కేశవస్వామి కళ్యాణ ఉత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం స్వామికి చక్రస్నానం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం పూర్ణాహుతితో పాటు అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సుదర్శన సీతారామాచార్యులు, రామ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజాధికాలు కొనసాగాయి. ఉత్సవాల్లో భక్తమండలి సభ్యులు ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఉప్పలబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వయంభూ ఆలయ ప్రాంగణంలో నేత్ర వైద్య శిబిరం


రోగులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

చోడవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయ ప్రాంగణంలో అర్చకులు కొబమంచిలి చలపతి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత నేత్ర చికిత్సా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృద్ధులు, మహిళలకు ఉచితంగా నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సురేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎంపీడీవో సీతామహాలక్ష్మి
- సచివాలయాల ఆకస్మిక తనిఖీలు

మాకవరపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయం ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని లచ్చన్నపాలెం, కొండలఅగ్రహారం సచివాలయాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సచివాలయం ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందాలన్నారు. అనంతరం హాజరు పట్టీ, వారి పనితీరును పరిశీలించారు. అలాగే పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


లచ్చన్నపాలెంలో సచివాలయ ఉద్యోగులకు ప్రశ్నిస్తున్న ఎంపీడీవో

నేడు జిల్లా స్థాయి గుర్రం పరుగు పోటీలు

చీడికాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈ మండలంలోని అర్జునగిరి గ్రామంలో గురువారం జిల్లా స్థాయి గుర్రం పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు బుధవారం నిర్వాహకులు తెలిపారు. స్వయంభూ వరహా లక్ష్మీనృసింహ వైభోగరాయ స్వామివారి కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం మూడు గంటల వరకూ పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు మధ్యాహ్నం మూడు గంటల్లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

15న మండల సమావేశం

చోడవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పీవీఎస్‌జే ఆంజనేయులు తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్, వైద్య ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలపై సమీక్ష ఉంటుందని చెప్పారు. మండల పరిషత్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

18 నుంచి అవయవ దానంపై అవగాహన సదస్సులు

చోడవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో అవయవ దానంపై ఈ నెల 18వ తేదీ నుంచి రెండు రోజుల పాటు విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు విశ్వనాథ్ బాబ్జి తెలిపారు. ఈ సదస్సులకు ప్రముఖ ఉపన్యాసకులు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి హాజరవుతారని చెప్పారు. సదస్సులలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వండి

రావికమతం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై పోలీస్ స్టేషన్ లేదా అంగన్‌వాడీ కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. మండలంలోని కొత్తకోట గ్రామంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, ఈవ్‌టీజింగ్, బాలికల అక్రమ రవాణాపై తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో విద్యార్థినులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే బస్టాండ్, పాఠశాల ఆవరణ, ఇళ్లకు వెళ్లే సందర్భాలలోనూ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై 100 నంబరుకు సమాచారం ఇచ్చి రక్షణ పొందాలని సూచించారు.

నర్సీపట్నం మహిళా బాక్సర్లకు పతకాలు


బాక్సింగ్ టోర్నమెంట్‌లో పతకాలు సాధించిన యువతులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో నర్సీపట్నానికి చెందిన పలువురు మహిళా బాక్సర్లు సత్తా చాటారు. 75 కిలోల విభాగంలో బొగ్గు మౌనిక, 80 కిలోల విభాగంలో వద్దాది నళిని బంగారు పతకాలు సాధించారు. 60 కిలోల విభాగంలో ఎల్.సమంత వెండి పతకం, 80 కిలోల విభాగంలో సీహెచ్ రోహిణి, కె.తేజస్విని కాంస్య పతకాలు పొందారు. యర్రా తేజస్విని78 కిలోల విభాగంలో కాంస్య పతకంతోపాటు బెస్ట్ లూసర్ అవార్డును కైవసం చేసుకున్నారు. వీరిని ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, కోచ్ అబ్బు, నింజాస్ అకాడమి డైరెక్టర్ వెలగా నారాయణరావు అభినందించారు.

కల్యాణపులోవ తిరునాళ్లకు ముమ్మర ఏర్పాట్లు

» జలాశయం వద్ద ఘాట్‌లు, మెట్లు నిర్మాణం


కల్యాణపులోవ రిజర్వాయర్ వద్ద మెట్లు నిర్మిస్తున్న దృశ్యం

రావికమతం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని కల్యాణపులోవలో నిర్వహించే తిరునాళ్లకు హాజరయ్యే భక్తులకు పలు సదుపాయాలు కల్పించే పనులు ముమ్మరంగా సాగుతు న్నాయి. చీమలపాడు పంచాయతీ శివారు కల్యాణపులోవలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే కల్యాణ పోతురాజుబాబు, పెద్దింటమ్మవార్ల తిరునాళ్లకు ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు ఉత్తరాంధ్రలోని ఇతర జిల్లాల నుంచి సుమారు మూడు లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తూ దేవదాయ, రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీసు శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జలాశయంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఇబ్బంది కలగకుండా కట్ట మీద నుంచి నీటి వరకు మెట్లు, నాలుగు ఘాట్లు నిర్మిస్తున్నారు. ఈ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భగవంతరావు పర్యవేక్షిస్తున్నారు.

టీచర్లకు షోకాజ్ నోటీసులు

... 5వ పేజీ తరువాయి

కావడంలేదని ఇటీవల విద్యా శాఖ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు బుధవారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయిని ఎం.పార్వతి సెలవులో వుండగా, మిగిలిన ఇద్దరు టీచర్లు పి.పద్మవల్లి, కేవీవీ లక్ష్మి పాఠశాలలో ఉన్నారు. డీఈవో తొలుత పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం వివిధ సబ్జెక్టులపై విద్యార్థులకు ప్రశ్నలు వేశారు. మూడు, నాలుగు తరగతుల విద్యార్థులు కనీసం తెలుగు సబ్జెక్టుకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు సమాధానాలుఉ చెప్పలేకపోయారు. పాఠాల బోధనలో నాణ్యతా ప్రమాణాలు లోపించినట్టు గుర్తించిన ఆయన హెచ్‌ఎంతోపాటు మిగిలిన ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అంతకుముందు రావికమతం, జడ్.కొత్తపట్నం ఉన్నత పాఠశాలలను డీఈవో తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు పాఠాలకు సంబంధించి పలు ప్రశ్నలు వేశారు. విద్యార్థులు ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడ్డారో తెలుసుకుని పూర్తిగా అర్థమయ్యేలా బోధించాలని హెచ్‌ఎంకు సూచించారు.

ప్రమాదంతో చెట్టపట్టాలు

అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో కాలినడక వంతెన, లిఫ్ట్ ఉన్నా వినియోగించని ప్రయాణికులు

» పట్టాలు దాటి రాకపోకలు
» ప్రమాదమని తెలిసినా అదే తీరు
» రైల్వే అధికారులు అవగాహన కల్పిస్తున్నా బేఖాతరు


పట్టాలు దాటుతున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం కాలినడక వంతెన నిర్మించినా, ఎక్స్‌కవేటర్, లిఫ్ట్ ఏర్పాటు చేసినా ఫలితం కనిపించడం లేదు. ఎప్పటిలాగానే ప్రయాణికులు పట్టాలు దాటుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదమని తెలిసినా వారిలో మార్పు రావడం లేదు.

అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు ఇటు విజయవాడ, అటు విశాఖపట్నం వెళ్లే రైళ్లు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రెండు ప్లాట్‌ఫారాల నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన మార్గంలోని టికెట్ బుకింగ్ కౌంటరు వద్ద రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు ప్రయాణికులు సులువుగా చేరేందుకు ఎస్కలేటర్ సౌకర్యం ఉంది. అయితే ప్రధాన మార్గం నుంచి కంటే గూడ్స్‌షెడ్ వైపే


రైల్వే స్టేషన్‌లో కాలినడక వంతెన

ప్రయాణికులు రాకపోకలు ఎక్కువగా సాగిస్తుంటారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని రైల్వేశాఖ కాలినడక వంతెన, లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేసింది. అయినా ప్రయాణికులు ప్లాట్‌ఫారాల పైకి వెళ్లడానికి, ప్లాట్‌ఫారాల నుంచి రోడ్డు పైకి రావడానికి గూడ్స్‌షెడ్ మార్గంలో ఉన్న పట్టాలపైనే రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో ఈ విధంగా రాకపోకలు సాగించడం వల్ల రాయగడకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు.

స్టీల్ గడ్డర్లు ఏర్పాటు చేసినా..

పట్టాలు దాటి రెండు, మూడు ప్లాట్‌ఫారాలపైకి వెళ్లడానికి వీల్లేని విధంగా రైల్వేశాఖ గూడ్స్‌షెడ్ వైపు స్టీల్ గడ్డర్లు ఏర్పాటు చేసినా వాటి మధ్యలోంచే ప్రయాణం సాగిస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో సుమారు రూ.రెండు కోట్లతో రైల్వేశాఖ గూడ్స్‌షెడ్ వైపు ప్రయాణికుల సౌకర్యార్థం రెండు, మూడు ప్లాట్‌ఫారాలపైకి వెళ్లి ప్రయాణం సాగించడానికి కాలినడక వంతెన నిర్మించింది. అంతేకాకుండా దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యం కోసం లిఫ్ట్ కూడా ఏర్పాటు చేసింది. అయితే కోట్లు ఖర్చు చేసి రైల్వేశాఖ ఏర్పాటు చేసిన ఈ సౌకర్యాలను ప్రయాణికులు వినియోగించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై స్టేషన్ మేనేజర్ సచ్చి నివాస్‌ను వివరణ కోరగా ప్రయాణికులు పట్టాలు దాటి ప్లాట్‌ఫారాల పైకి రావద్దని, లిఫ్ట్, కాలినడక వంతెన ద్వారా రాకపోకలు సాగించాలని ప్రతి రోజూ మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నామని, కానీ కొందరు ప్రయాణికుల్లో మార్పు రావడం లేదని ఆయన తెలిపారు.

విశిష్ట గుర్తింపు కార్డుతో రైతులకు మేలు

» రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి
» జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహన్‌రావు

సబ్బవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమల్లోకి తీసుకొచ్చిన రైతులకు విశిష్ట గుర్తింపు కార్డుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మండలంలోని బంగారమ్మపాలెం రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న విశిష్ట గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశిష్ట గుర్తింపు కార్డు వలన ప్రభుత్వాలు అమలు చేస్తున్న కిసాన్ భరోసా సాయం, అన్నదాత, సుఖీభవ, రాయితీలు, పెట్టుబడి, ఎరువుల రాయితీ, పంటల బీమా, కనీస మద్దతు ధర, పంట రుణాలు తదితర వ్యవసాయ రంగంలోని అన్ని పథకాలు పొందవచ్చన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం జెరాక్స్ లేదా 1బీ, ఆధార్ జెరాక్స్, ఆధార్ నంబరుకు లింకైన ఫోన్ నెంబరు వ్యవసాయ సిబ్బందికి ఇచ్చి రైతులు సహకరించాలని ఆయన కోరారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కొన్ని గ్రామాల్లో సాంకేతిక లోపాలు ఉన్నట్టు గుర్తించామని, త్వరలోనే సరిచేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య, వీఏఏ బొబ్బరి లావణ్య, గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, రాజుకోటి తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపుల్లో తనిఖీలు

» బియ్యం బస్తాలు, ఉప్పు ప్యాకెట్లలో తక్కువ బరువు ఉన్నట్టు గుర్తింపు
» మూడు దుకాణాలపై కేసులు నమోదు


జోగంపేటలోని ఒక కిరాణా షాపులో బియ్యం బస్తాను తూకం వేయిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారిణి అనూరాధ

గొలుగొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల శాఖ నర్సీపట్నం డివిజన్ అధికారిణి అనూరాధ బుధవారం పలు గ్రామాల్లోని కిరాణా షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. జోగంపేటలోని ఒక కిరాణా షాపులో బియ్యం బస్తాలపై 26 కిలోలుగా ముద్రించి వుంది. అనుమానం వచ్చిన ఆమె బియ్యం బస్తాలను తూకం వేయించగా ఒక్కో బస్తాలో 24 కిలోలు మాత్రమే వున్నాయి. అదే విధంగా క్రిస్టల్ ఉప్పు కిలో ప్యాకెట్‌లలో వంద గ్రాములు తక్కువ ఉండడాన్ని గుర్తించారు. దీంతో నాలుగు బియ్యం బస్తాలను సీజ్ చేశారు. చీడిగుమ్మల, గొలుగొండ గ్రామాల్లో కూడా కిరాణా షాపుల్లో కాటాల్లో తేడా ఉండడాన్ని గుర్తించారు. మొత్తం మూడు షాపులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిత్యావసర సరకుల తూకంలో తేడాలను వినియోగదారులు గుర్తించాలన్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు సరకులు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని.. మొహం చాటేశాడు!

» కుటుంబ సభ్యులకు ఇష్టం లేదంటూ మెసేజ్ » న్యాయం చేయాలంటూ యువకుడి ఇంటి ముందు ఆందోళన


యువకుడి ఇంటి ముందు ఆందోళన చేస్తున్న స్వాతి, సీఐటీయూ నాయకులు


గత ఏడాది తగరపువలసలో పెళ్లి చేసుకున్న సురేశ్, స్వాతి

కె.కోటపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ డిగ్రీ చదువుతున్నప్పుడు ప్రేమలో పడ్డారు. అప్పటి నుంచి ప్రేమను కొనసాగిస్తూ ఎనిమిదేళ్ల తరువాత గుళ్లో పెళ్లి చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా చేశారు. కొన్నాళ్లు కాపురం చేసిన తరువాత యువకుడు చెప్పాపెట్టకుండా సొంతూరు వెళ్లిపోయాడు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆ యువతి గ్రామానికి వచ్చి, సీఐటీయూ నాయకుల సహకారంతో యువకుడి ఇంటి ముందు ధర్నాకు దిగింది. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి, న్యాయం జరిగిలే చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

కె.కోటపాడు మండలం రొంగలనాయుడుపాలెం గ్రామానికి చెందిన గుదే సురేశ్, విశాఖలోని మధురవాడ ప్రాంతానికి చెందిన కాశీ స్వాతి నగరంలోని కృష్ణా కళాశాలలో 2013-16 సంవత్సరాల్లో డిగ్రీ చదివారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమకు దారితీసింది. సుమారు ఎనిమిదేళ్లపాటు ప్రేమించుకున్న వీరు గత ఏడాది అక్టోబరు 9వ తేదీన తగరపువలసలోని కొండపై వున్న రామాలయంలో స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. అదే నెల 16వ తేదీన మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మధురవాడలో ఇల్లు అద్దెకు తీసుకొని కాపురం మొదలుపెట్టారు. రెండు నెలల తరువాత సురేశ్ రొంగలనాయుడుపాలెం వెళుతున్నట్టు ఆమెకు చెప్పాడు. రెండు రోజులైనా తిరిగి రాకపోవడంతో సురేశ్‌కు ఫోన్ చేసింది. మనం పెళ్లి చేసుకోవడం తన కుటుంబ సభ్యులకు ఇష్టం లేదని, వారిని ఒప్పించి తిరిగి వస్తానని, అప్పటి వరకు వేచి ఉండాలని చెప్పాడు. తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దిక్కుతోచని స్థితిలో స్వాతి ఇల్లు ఖాళీ చేసి పుట్టింటికి వెళ్లింది. సురేశ్ తనను పెళ్లి చేసుకుని, కొంతకాలం నుంచి మొహం చాటేస్తున్నాడని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని నగరంలోని సీఐటీయూ నేతలను కోరింది. వారి ద్వారా బుధవారం రొంగలనాయుడుపాలెంలో సురేశ్ ఇంటికి చేరుకుని ఆందోళనకు చేపట్టింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న వారిని విడదీయడం న్యాయం కాదని, వారిద్దరినీ ఒకటి చేయడానికి సహకరించాలని సురేశ్ తండ్రి కొండబాబును సీఐటీయూ నాయకులు కోరారు. ఇందుకు ససేమిరా అన్న ఆయన.. తన ఇంటి వద్ద ధర్నా చేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి ఇరువర్గాల వారితో మాట్లాడారు. అన్ని విషయాలను పరిశీలించి న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో స్వాతి ఆందోళన విరమించింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, గండి నాయనబాబు, ఎర్ర దేవుడు, స్వాతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మరిన్ని అన్న క్యాంటీన్‌లు!

... 5వ పేజీ తరువాయి

కొనసాగించకుండా 2019 ఆగస్టులో అన్న క్యాంటీన్లను వైసీపీ పాలకులు మూసివేయించారు. మీకు నచ్చిన పేరు పెట్టుకుని, క్యాంటీన్లను కొనసాగించాలని టీడీపీ అధినేత చంద్రబాబుతోసహా పలువురు నాయకులు విజ్ఞప్తి చేసినప్పటికీ వైసీపీ పాలకులు ససేమిరా అన్నారు. దీంతో ఆయా భవనాలు నిరుపయోగంగా మారాయి. లోపల సామగ్రి పాడైపోయింది.

ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లను తెరిపిస్తామని గత ఏడాది ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతోపాటు ఆ పార్టీ నేతలు హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో సైతం చేర్చారు. ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంతో ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్న క్యాంటీన్లను పునరుద్ధరించారు. నర్సీపట్నంలో సెప్టెంబరు 18వ తేదీన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, 19వ తేదీన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి, రైల్వే స్టేషన్ వద్ద, ఎలమంచిలిలో అక్టోబరు మూడో తేదీన ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అన్న క్యాంటీన్‌లను ప్రారంభించారు. కాగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఒక క్యాంటీన్‌ను ఏర్పాటు చేసే అంశంపై ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. సాధ్యమైనంత త్వరగా కొత్త క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనిప్రకారం జిల్లాలో ప్రస్తుతం అన్న క్యాంటీన్లు నిర్వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలతోపాటు (అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి) కొత్తగా మాడుగుల, చోడవరం, పాయకరావుపేట నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఆరు క్యాంటీన్ల ఏర్పాటుకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన వెంటనే స్థలాలను ఎంపిక చేసి భవన నిర్మాణ పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు.

క్రైం... crime news

మనస్తాపంతో ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య

కొత్తూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో అనకాపల్లి పట్టణానికి చెందిన ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి. తాకాశి వీధికి చెందిన ఎ.నాగేషు (50) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య వాణి 20 ఏళ్ల క్రితం నుంచి ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి విశాఖపట్నంలో ఉంటోంది. అప్పటి నుంచి తల్లితో కలిసి నాగేషు ఉంటున్నాడు. ఏడాది క్రితం తల్లి మృతిచెందడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంటి మెట్ల వద్ద ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

మహిళను ఏమార్చి రూ.30 వేలు తస్కరణ

» నర్సీపట్నం ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌లో ఘటన
» సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు


గ్రీన్ షర్టు వేసుకున్న వ్యక్తిని నిందితుడిగా గుర్తించిన పోలీసులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణాబజార్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌లో ఒక వ్యక్తి, మహిళను ఏమార్చి రూ.30 వేలు తస్కరించాడు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఉమామహేశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణాబజార్ సమీపంలో నివాసం ఉంటున్న షేక్ రుక్సానా బేగం ఈ నెల 10న తన తల్లి నస్రీన్ బేగం ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.30 వేలు డ్రా చేయడానికి ఎస్‌బీఐ ఏటీమ్ కేంద్రానికి వెళ్లింది. ఏటీఎం కార్డు ఉపయోగించి రూ.10 వేలు చొప్పున మూడుసార్లు రూ.30 వేలు డ్రా చేసింది. తల్లి ఖాతాలో మిగిలిన డబ్బులను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడానికి బ్యాంక్‌కు వెళ్లింది. అయితే ఖాతాల నుంచి రూ.60 వేలు డ్రా చేసినట్టు బ్యాంకు అధికారులు చెప్పారు. దీంతో షాక్‌కి గురైన రుక్సానా బేగం తన వద్ద ఉన్న ఏటీఎం కార్డు చూసుకుంది. కార్డు మారిపోయినట్టు గుర్తించింది. తాను ఏటీఎం నుంచి రూ.30 వేలు మాత్రమే డ్రా చేశానని చెప్పింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వచ్చి ఏటీఎం సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు.

ఏటీఎం కార్డును మార్చేసిన ఆగంతకుడు

రుక్సానా బేగం ఏటీఎం మిషన్ నుంచి నగదు తీస్తున్న సమయంలో వెనకనున్న ఓ వ్యక్తి పిన్ నంబరు గమనించాడు. మూడోసారి ఆమె నగదు తీసే సమయంలో మిషిన్‌లో నుంచి ఏటీఎం కార్డు తీసి ఆమెకు ఇచ్చే క్రమంలో నేర్పుగా కార్డు మార్చేశాడు. అనంతరం రుక్సానా బేగం ఏటీఎం కార్డుతో రూ.30 వేలు నగదు డ్రాచేశాడు. ఈ మొత్తం వ్యవహారాన్ని పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలో పరిశీలించారు. రుక్సానా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని గుర్తించామని, త్వరలో అరెస్టు చేస్తామని సీఐ గోవిందరావు తెలిపారు.

నేల బావిలో జారిపడి రైతు మృతి

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పొలంలోని నేలబావిలో ప్రమాదవశాత్తూ జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఎస్.రాయవరంలోని పేపకాయల వీధికి చెందిన అరిగిల శ్రీనివాసరావు (54) తన కుమారుడు రాజేశ్‌తో కలిసి బుధవారం ఉదయం పొలానికి వెళ్లాడు. పనులు పూర్తయిన తరువాత శ్రీనివాసరావు ముఖం కడుక్కోవడానికి నేల బావి వద్దకు వెళ్లాడు. నీరు తోడుతుండగా కాలు జారి బావిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన అతని కుమారుడు రాజేశ్ బిగ్గరగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వున్న రైతులు చేరుకుని బావిలో నుంచి శ్రీనివాసరావును బయటకు తీశారు. అయితే అప్పటి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ప్రసూతి, శిశు మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు

» కలెక్టర్ విజయకృష్ణన్ హెచ్చరిక


మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసూతి, శిశు మరణాలు సంభవించినా, ప్రసూతి కేసులను ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేసినా సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ విజయకృష్ణన్ హెచ్చరించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి ప్రసూతి, శిశు మరణాల కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జరిగింది. జూలై నుంచి డిసెంబరు వరకు జిల్లాలో ప్రసూతి మరణాలు, నవజాతి శిశు మరణాలు సంభవించగా, వాటిపై కలెక్టర్ సమీక్షించారు. ఆయా మరణాలకు కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రసూతి, శిశు మరణాలు సంభవించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని విడనాడాలని, మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. మరణాల తరువాత సమీక్షించడం కంటే, అవి సంభవించకుండా అరికట్టడమే అత్యంత ముఖ్యమన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఏమరుపాటుగా ఉన్నా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో డీఎం హెచ్‌వో డాక్టర్ పి. రవికుమార్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	96.00
లైవ్ ధర	116.00
విత్ స్కిన్	202.00
స్కిన్ లెస్	212.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469